జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
NEWS IS RIGHT
https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్తు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 15 సంచిక 172 విశాఖపట్నం | మంగళవారం 08 మార్చి 2022 | 8 పేజీలు | వెల : 5.00

# రాష్ట్రంలో రెండో భాషగా ఉర్దూ..

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం



అమరావతి: బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ కేబినెట్ పలు కీలక చట్టాల సవరణలకు ఆమోదం పలకడంతోపాటు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో రెండో భాషగా ఉర్దూను గుర్తిస్తూ ఏపీ కేబినెట్ నిర్ణయించింది. దీనిలో భాగంగా.. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టం 1966కు సవరణ చేయాలని తీర్మానించింది. అలాగే విదేశీ మద్యం నియంత్రణ చట్టసవరణకు కూడా నిర్ణయం తీసుకుంది. నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి కూడా కేబినెట్ ఆమోదం పలికింది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం జరిగిన ఏపీ కేబినెట్ సమావేశంలో 35 కీలక అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టే పలు బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. టీటీడీ ప్రత్యేక ఆహ్వానితులపై అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచుతూ శాసనసభలో ప్రవేశపెట్టనున్న బిల్లుకు ఆమోదం లభించింది. ఉర్దూను సెకెండ్ లాంగ్వేజ్‌గా చదువుకునేందుకు చట్ట సవరణకు కేబినెట్ నుంచి ఆమోదం లభించింది. తూనికలు, కొలతలశాఖలో నిబంధనలు అమలు కోసం మెరుగైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులకు మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.1234 కోట్ల రూపాయిలతో మూడు ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి ఆమోదం లభించింది. బెంగుళూరు-కడప, విశాఖపట్నం-కడప మధ్య వారానికి మూడు విమాన సర్వీసులు నడపేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. (మిగతా 2లో..)

# మూడేళ్లుగా వికేంద్రీకృత పరిపాలన ఉండేలా ప్రభుత్వం కృషి: గవర్నర్



అమరావతి: ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభంకాగానే గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. మూడేళ్లుగా వికేంద్రీకృత పరిపాలన ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, వికేంద్రీకరణతో రాష్ట్రాభివృద్ధి జరుగుతోందన్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 0.22 జీఎస్టీపీ వృద్ధి జరిగిందన్నారు. సుపరిపాలన లక్ష్యానికి అనుగుణంగా 13 జిల్లాలను 26 జిల్లాలుగా మారుస్తున్నామని, ఉగాది నుంచి కొత్త జిల్లాల్లో పరిపాలనా వ్యవస్థ ప్రారంభమవుతుందన్నారు. ఉద్యోగులకు ఒకేసారి 5 డీఏలు విడుదల చేశామని గవర్నర్ బిశ్వభూషణ్ తెలిపారు. 11వ పీఆర్సీ అమలు, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచామన్నారు. తలసరి ఆదాయం 15.87 శాతం పెరిగి రూ.2,04,758కి చేరిందన్నారు. నవరత్నాలు ద్వారా మానవ, ఆర్థిక అభివృద్ధి జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. నాడు-నేడు, ఆరోగ్యశ్రీ, బాలామృతం అమలు చేస్తున్నామని గవర్నర్ తెలిపారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా మూడు వాయిదాలలో.. రూ.13,500 ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. పారదర్శక, అవినీతి రహిత పాలన అందిస్తున్నామని గవర్నర్ బిశ్వభూషణ్ వ్యాఖ్యానించారు.

# జెలెన్‌స్కీతో నేరుగా చర్చలు జరపండి..

## పుతిన్‌కు ప్రధాని మోదీ సూచన



ఉక్రెయిన్ : రష్యా - ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. 12 రోజులుగా రష్యా.. ఉక్రెయిన్‌పై బాంబుల వర్షం కురిపిస్తోంది. ఈ క్రమంలో ఎక్కడ చూసినా భీకర పరిస్థితి కనిపిస్తోంది. ఈ క్రమంలో రష్యా - ఉక్రెయిన్ యుద్ధానికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ రంగంలోకి దిగారు. సోమవారం ఇరు దేశాధినేతలతో ఫోన్ ద్వారా సంభాషించారు. ఇప్పటివరకు జరిగిన నష్టం చాలని.. ఇంకా యుద్ధం వద్దని సూచించారు. దీనికోసం ఇరు దేవాధినేతలతో శాంతియుతంగా నేరుగా చర్చలు జరుపుకోవాలంటూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీకి సూచించారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. జెలెన్‌స్కీతో సంభాషించిన అనంతరం ప్రధాని మోదీ దాదాపు 50 నిమిషాల పాటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ భేటీలో ఉక్రెయిన్‌లో నెలకొన్న పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. ఉక్రెయిన్, రష్యా జట్ల మధ్య చర్చల స్థితిగతులపై అధ్యక్షుడు పుతిన్ ప్రధాని మోదీకి వివరించారు. తమ బృందాల మధ్య జరుగుతున్న చర్చలతోపాటు ఉక్రెయిన్ అధ్యక్షుడు (మిగతా 2లో..)




## యూపీ బీజేపీదే: అత్యధిక ఎగ్జిట్ పోల్స్ వెల్లడి

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని అత్యధిక ఎగ్జిట్ పోల్స్ వెల్లడిస్తున్నాయి. మోదీ - యోగీ డబుల్ ఇంజిన్ సర్కారుకు మళ్లీ ప్రజామోదం లభించిందని తెలిపాయి. రిపబ్లిక్ టీవీ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం యూపీలో బీజేపీకి 262 నుంచి 277 స్థానాలు దక్కుతాయి. న్యూస్ 18 ప్రకారం బీజేపీకి 263 స్థానాలు దక్కుతాయి. పీపుల్స్ పల్స్ 220 నుంచి 240 స్థానాలు బీజేపీకి దక్కుతాయని వెల్లడించింది.

# 2024 వరకు హైదరాబాదే రాజధాని

## బొత్స కీలక వ్యాఖ్యలు



అమరావతి : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు మొదటి రోజున వాడీవేడీగా సాగుతున్నాయి. ఓ వైపు గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ప్రసంగిస్తుండగా.. టీడీపీ సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలో మీడియా పాయింట్‌లో పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. తెలంగాణ, ఢిల్లీలో కూడా చర్చకు దారితీశాయి. '2024 వరకు మన రాజధాని హైదరాబాదే. దాన్ని ఆధారంగా చేసుకునే బహుశా కోర్టులు మాట్లాడి ఉంటాయి. ఎందుకంటే.. రాజధానిని మేం గుర్తించిన తర్వాత.. చట్టం చేసి.. పార్లమెంట్‌కు పంపి.. అక్కడ ఆమోదం పొందిన తర్వాత తెలుస్తుంది. అయితే అమరావతి, హైదరాబాద్ అని రెండు రాజధానులు లేవు. మా ప్రభుత్వం ప్రకారం అమరావతి అనేది శాసన రాజధాని మాత్రమే' అని బొత్స వ్యాఖ్యానించారు. అయితే బొత్స చేసిన ఈ వ్యాఖ్యలు కొత్త చర్చకు దారితీశాయి. ఇప్పటికే అమరావతే రాజధాని అని అక్కడ్నుంచే అన్ని కార్యకలపాలు సాగించాలని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. మరోవైపు మూడు రాజధానులు కట్టాలా..? వద్దా..? అని జగన్ సర్కార్ ఆలోచనలో పడింది. ఈ క్రమంలో బొత్స చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అయ్యాయి. ఎవరి పనులు వాళ్లు చేయాలి..! మూడు రాజధానులపై మాట్లాడండి.. అసలు రాజధానులు కడుతున్నారా..? అని మీడియా మిత్రులు.. మంత్రిని ప్రశ్నించగా.. ' ఇప్పుడే కదా అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 31లోపు అన్ని విషయాలు తెలుస్తాయి. రాజధానులు కట్టకూడదని హైకోర్టు ఎక్కడ చెప్పింది..? చట్టాలు చేయడానికి శాసనసభ, పార్లమెంట్‌లు ఉన్నాయి. ఇక్కడ చట్టాలు చేస్తే రాజ్యాంగ స్ఫూర్తికి, రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి అనేది నేను ఇదివరకే చెప్పాను. అలా కాదు.. శాసనసభ, పార్లమెంట్‌లు చట్టాలు చేయకూడదని కోర్టు చెప్పడమేంటి..? ఇవి చేయకూడదని న్యాయస్థానాలు చెబితే అసలు వ్యవస్థ ఎక్కడుంటుంది..?. రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంటే కదా తప్పుబట్టొచ్చు.. (మిగతా 2లో..)

# 13 రాజ్యసభ స్థానాలకు మార్చి 31న ఎన్నికలు: ఈసీ



న్యూఢిల్లీ: దేశంలోని 6 రాష్ట్రాలకు చెందిన 13 రాజ్యసభ స్థానాలకు ఈనెల 31వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల కమిషన్ సోమవారంనాడు ప్రకటించింది. అసోం, హిమాచల్ ప్రదేశ్, కేరళ, నాగాలాండ్, త్రిపుర నుంచి రాజ్యసభ సభ్యులు ఏప్రిల్ 2న రిటైర్ కానుండగా, పంజాబ్ నుంచి ఐదుగురు సభ్యులు ఏప్రిల్ 9న రిటైర్ కానున్నారు. రిటైర్ కానున్న వారిలో కాంగ్రెస్ సీనియర్ నేతలు ఏకే ఆంటోని, ఆనంద్ శర్మ ఉన్నారు. పంజాబ్ నుంచి ఖాళీ కానున్న ఐదు సీట్లలో మూడు సీట్లు ఒక ఎన్నికల్లో, మరో రెండు స్థానాలు మరో ఎన్నికలో పూర్తి చేస్తాం" అని కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ద్వైవార్షిక ఎన్నికల నోటిఫికేషన్ మార్చి 14న జారీ చేస్తామని, 31న ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొంది. యథాప్రకారం ఓటింగ్ జరిగిన రోజే సాయంత్రం 5 గంటల నుంచి కౌంటింగ్ మొదలవుతుందని ఈసీ తెలిపింది. పదవీకాలం ముగుస్తున్న రాజ్యసభ సభ్యులలో ఏకే ఆంటోనీ (కేరళ), ఆనంద్ శర్మ (హిమాచల్ ప్రదేశ్), (మిగతా 2లో..)

## పంజాబ్ కింగ్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ: పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుని అధికారంలోకి వచ్చే అవకాశాలున్నాయని ఇండియా టుడే ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. 117 స్థానాలకు గాను ఆప్ 76 నుంచి 90 సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేసింది. కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదని తేల్చి చెప్పింది. అధికార కాంగ్రెస్ పార్టీకి 19 నుంచి 31 స్థానాలు దక్కనున్నాయని వెల్లడించింది. బీజేపీకి ఒకటి నుంచి 4, ఇతరులకు 7 నుంచి 11 స్థానాలు దక్కే అవకాశముంది. ఇవి ఎగ్జిట్ పోల్స్ మాత్రమే. అసలు ఫలితాలు ఈ నెల 10న వెల్లడౌతాయి.

## సినిమా టిక్కెట్ల కొత్త ధరలతో జీవో విడుదల



అమరావతి : తెలుగు చలన చిత్ర పరిశ్రమకు సంబంధించి ఏపీలో ఉన్న సమస్యల పరిష్కార నిమిత్తమై ఇటీవల సీఎం జగన్‌ను ఇండస్ట్రీ తరపు నుండి కొందరు పెద్దలు కలిసిన విషయం తెలిసిందే. ఆ భేటీ తర్వాత ఏపీలో టాలీవుడ్‌కి ఉన్న సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, ముఖ్యంగా సినిమా టికెట్ల ధరల విషయమై మరోమారు కమిటీతో చర్చలు జరిపి.. సరికొత్తగా జీవోని విడుదల చేయబోతున్నట్లుగా సినీ పెద్దలు ప్రకటించారు. ఇదంతా జరిగి దాదాపు నెల కావొస్తోంది. మధ్యలో వైసీపీ నేత గౌతమ్ రెడ్డి హఠాన్మరణం కారణంగా ఈ జీవో ఇవ్వడం ఆలస్యమైందని మంత్రి పేర్ని నాని ప్రకటించారు. ఇలాంటి నేపథ్యంలో ఇండస్ట్రీ అంతా ఎప్పుడా.. ఎప్పుడా అని ఎదురుచూస్తున్న కొత్త జీవోని నేడు(సోమవారం) ఏపీ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ జీవోలో ఉన్న సినిమా టికెట్ల ధరల విషయానికి వస్తే.. మున్సిపల్ కార్పొరేషన్: నాన్ ఏసీ థియేటర్లలో రూ.60, రూ.40ఏసీ థియేటర్లలో రూ.100, రూ.70స్పెషల్ థియేటర్లలో రూ.125, రూ.100మల్టీప్లెక్స్‌లో రెగ్యులర్ సీట్లు రూ.150, రిక్లయినర్ సీట్లు రూ.250

మున్సిపాలిటీ: నాన్ ఏసీ థియేటర్లలో రూ.50, రూ.30ఏసీ థియేటర్లలో రూ.80, రూ. 60స్పెషల్ థియేటర్లలో రూ.100, రూ.80మల్టీప్లెక్స్‌లో రెగ్యులర్ సీట్లు రూ.125, రిక్లయినర్ సీట్లు రూ.250

నగర/గ్రామ పంచాయతీ నాన్ ఏసీ థియేటర్లలో రూ.40, రూ.20ఏసీ థియేటర్లలో రూ.70, రూ.50స్పెషల్ థియేటర్లలో రూ.90, రూ.70మల్టీప్లెక్స్‌లో రెగ్యులర్ సీట్లు రూ.100, రిక్లయినర్ సీట్లు రూ.250 (ఈ రేట్లకు జీఎస్టీ అదనం)



## రాష్ట్రంలో రెండో భాషగా ఉర్దూ..

(మొదటి పేజీ తరువాయి)

సర్వీసులు మొదలైన తర్వాత ఏడాదికి రూ.15 కోట్ల మేర మద్దతును రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. దీంతోపాటు మచిలీపట్నం, భావనపాడు, రామాయపట్నం పోర్టుల నిర్మాణం కోసం రూ.8,741 కోట్ల రుణ సమీకరణకు ఏపీ మారిటైం బోర్డుకు హామీ ఇచ్చేందుకు ఏపీ మంత్రివర్గం అంగీకరిస్తూ తీర్మానం చేసింది. మడకశిర బ్రాంచ్ కెనాల్ పనులకు రూ.214 కోట్లు కేటాయిస్తూ కేబినెట్ తీర్మానించింది. రూ.8741 కోట్ల రుణ సమీకరణకు ఏపీ మారిటైం బోర్డుకు హామీ ఉండేందుకు కేబినెట్ ఆమోదం తెలుపుతూ తీర్మానం చేసింది.

## 2024 వరకు హైదరాబాదే రాజధాని: బొత్స

(మొదటి పేజీ తరువాయి)

ఎవరి పనులు వాళ్లు చేయాలి.. చేసుకోవాలి. కోర్టులపై మాకు నమ్మకం ఉంది.. చట్టాలు చేయడానికే శాసనసభ ఉన్నది.. ఆ అధికారం చేసే అధికారం శాసనసభకు అధికారం ఉంది' అని మంత్రి చెప్పుకొచ్చారు.టీడీపీపై విమర్శలు..'టీడీపీకి విధి విధానాలు అనేవి లేవు. క్షణికావేశంలో టీడీపీ సభ్యులు నిర్ణయాలు తీసుకుంటారు. ఆ తర్వాత మళ్లీ ఏదో ఉద్ధరించాలని, ప్రజల నుంచి సానుభూతి పొందాలని, రాజకీయ సానుభూతితో అసెంబ్లీకి వచ్చారు. స్వార్థం కోసం తప్ప ప్రజా ప్రయోజనాలు, సమిష్టి నిర్ణయాలు, సమిష్టి అభిప్రాయాలు ఆ పార్టీకి లేవు. క్షణికావేశంలో తీసుకునే ఏ ఆలోచనలనూ ప్రజలు ఆమోదించరు. విశాలమైన ఆలోచనలు, దూర దృష్టితో తీసుకునే నిర్ణయాలను మాత్రమే ప్రజలు ఆమోదిస్తారు' అని టీడీపీపై బొత్స తీవ్ర విమర్శలు గుప్పించారు. మరి బొత్స చేసిన రాజధాని వ్యాఖ్యలపై టీడీపీ నేతలు, అమరావతి రైతుల సంఘాల నాయకుల నుంచి ఎలాంటి రియాక్షన్ వస్తుందో వేచి చూడాలి.

## జెలెన్‌స్కీతో నేరుగా చర్చలు జరపండి..

(మొదటి పేజీ తరువాయి)

జెలెన్‌స్కీతో నేరుగా చర్చలు జరపాలని ప్రధాని మోదీ అధ్యక్షుడు పుతిన్‌ను కోరారు. సుమీతో సహా ఉక్రెయిన్‌లోని కొన్ని ప్రాంతాల్లో కాల్పుల విరమణ ప్రకటించడం, మానవతా దృక్పథంతో ఆలోచించడంపై ప్రధాని మోదీ పుతిన్‌ను అభినందించారు. సుమీ నుంచి భారతీయ పౌరులను సురక్షితంగా తరలించడం గురించి మాట్లాడుతూ.. ఈ విషయంలో రష్యా స్ఫూర్తిగా నిలిచిందంటూ ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారతీయులను సురక్షితంగా తరలించేందుకు అన్ని విధాలా సహకరిస్తామంటూ ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రధాని మోదీకి హామీ ఇచ్చారు.

ఇదిలాఉంటే.. అంతకుముందు.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మాట్లాడారు. వీరిద్దరి మధ్య దాదాపు 35 నిమిషాల పాటు సంభాషణ కొనసాగింది. ఉక్రెయిన్ నుంచి భారత పౌరుల తరలింపులో సాయం పట్ల జెలెన్ స్కీకి మోదీ కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు అరగంటపైగా సాగిన ఈ ఫోన్ కాల్ ద్వారా మోదీ జెలెన్‌స్కీతో పలు విషయాలు చర్చించారు. రష్యా-ఉక్రేయిన్ల మధ్య శాంతి చర్చలు ఫలిస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఉక్రేయిన్ నుంచి భారత పౌరులను తరలించడంలో చేస్తున్న సహాయానికి మోదీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే సుమీ ప్రాంతంలో చిక్కుకున్న భారత పౌరులను సురక్షితంగా తరలింపులోనూ ఈ సాయం కొనసాగాలని జెలెన్ స్కీని కోరారు ప్రధాని మోదీ.

## 13 రాజ్యసభ స్థానాలకు మార్చి 31న ఎన్నికలు: ఈసీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రతాప్ సింగ్ బజ్వా, నరేష్ గుజ్రాల్ (పంజాబ్) వంటి ప్రముఖులు ఉన్నారు. రక్షణ శాఖ మాజీ మంత్రి ఏకే ఆంటోనీ, రాజ్యసభలో కాంగ్రెస్ డిప్యూటీ మంత్రి ఆనంద్ శర్మ, బజ్వాలు కాంగ్రెస్‌కు చెందిన వారు కాగా, గుజ్రాల్.. శిరోమణి అకాలీదళ్‌కు చెందిన వారు. పంజాబ్ నుంచి 5 సీట్లు ఖాళీ అవుతుండగా, కేరళలో 3, అసోంలో 2, హిమాచల్ ప్రదేశ్, నాగాలాండ్, త్రిపురల నుంచి ఒక్కో సీటు ఖాళీ కానుంది.

## సలోమీ కేసులో సక్రమంగా దర్యాప్తు జరగడం లేదు: నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్, మాజీఎమ్మెల్యే ఆమంచి



చీరాల : చీరాల 33వ వార్డు కౌన్సిలర్ గుండాల సలోమిపై, దాడి కేసులో ముద్దాయి సురేష్, ఆయన భార్య శివ కుమారి పోలీసు శాఖకు చెంది నవారై నందున,ఈ కేసును స్థానిక పోలీసులు నిర్వీర్యం చేస్తున్నారని, నియోజకవర్గ వైసిపిఇంచార్జ్, మాజి ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ సో మవారం జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ ను కలిసి ఫిర్యాదు చేశారు. దళిత వర్గానికి చెందిన మహిళపై జరిగిన దాడి కేసులో, ముద్దాయి పై బెయి లబుల్ సెక్షన్లు పెట్టి , స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపేశారని, ఆయన వివరించారు. దాడిలో తీవ్రంగా గాయపడి బాధితురాలు ప్రభుత్వాస్పత్రిలో చేరిన పది నిమిషాల్లోనే, ఏఎస్పై శివకుమారి అక్కడకు వచ్చి, కౌన్సిలర్‌ను తీవ్రంగా బెదిరించిందని, కేసు పెడితే బాగుండదని హెచ్చరించిం దని చెప్పారు. బా ధితురాలి వాంగ్మూలాన్ని నమోదుచేసిన, ఔట్ పోస్ట్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు ,దాన్ని పూర్తిగా వక్రీకరించి రాశారని తెలిపారు. బాధితురాలు చెప్పింది ఒకటైతే వెంకటేశ్వర్లు రాసింది మరొకటి అని ఆయన వివరించారు.ఇక స్థానిక పోలీసులు కూడా ఈ కేసును తేలి గ్గా తీసుకున్నారని, ఎవరూ శ్రద్ధ చూపడం లేదని ఆమంచి ఎస్పీకి తెలిపారు.ఈ కేసులో నిందితుడైన కానిస్టేబుల్ సురేష్ లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికి ఉద్యోగం కోల్పోయాడని, అతడి చరిత్ర పోలీసుశాఖకు పూర్తిగా తెలుసునన్నారు. ఇప్పుడు సురేష్ కాల్‌మనీ వ్యాపారం నడుపు తూ, అధిక వడ్డీలతో బీదా బిక్కిని పీడిస్తున్నాడని ఆమంచి వెల్లడించారు. సాటి మహిళగా ఒక దళితురాలైన సలోమీ కి న్యాయం చేయాల్సిం దిగా కృష్ణ మోహన్ ఎస్పీని అర్థించారు. జరిగిన సంఘటనంతా సలోమీ కూడా ఆమెకు తెలిపారు. తగినచర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఆమంచి వెంట ఏఎంసీ చైర్మన్ మార్పు గ్రెగోరి, కౌన్సిలర్లు సల్లూరి సత్యానందం, పాపిశెట్టి సురేష్ నాయుడు, యాతం జ్యోతి, పం ద్దూరి శిరీష, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోటి దాసు, వసంతరావు తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకే "గౌరవ సభలు "

### 8వార్డు గౌరవ సభలో మాజీ మంత్రి ప్రత్తిపాటి



చిలకలూరిపేట:(ప్రజా పాలన) రాష్ట్రంలో ప్రస్తుతం ఒక అసమర్ధ, నియంతృత్వ పాలన సాగుతుందని, ఈ ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్ర స్థాయిలో ప్రజలలోకి తీసుకు వెళ్లడానికి ఏర్పాటు చేసినవే ఈ గౌరవ సభలు అని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని 8వ వార్డు లో ఏర్పాటు చేసిన గౌరవ సభకు విచ్చేసిన ప్రజలను ఉద్దేశించి తెలియజేశారు. స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద 8వ వార్డు గౌరవ సభను ఏర్పాటు వేయడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ముందుగా వార్డుకు విచ్చేసిన ప్రత్తిపాటికి వార్డు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణాసంచా, పూల వర్షంతో స్వాగతం పలికారు. అనంతరం గౌరవ సభనుద్దేశించి పలువురు ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ, మాట తప్పను.. మడమ తిప్పను అని బూటకపు మాటలు చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రజల విశ్వసించే స్థితిలో లేరని చెప్పారు. అధికారంలోకి రాగానే పెన్షన్ 2,000 నుండి 3,000 కు పెంచుతానని చెప్పి అవ్వా, తాతలను మోసం చేశారని, మధ్య నిషేధం - చేస్తానని చెప్పి, బార్ షాప్ లు మరిన్ని పెంచి మహిళలను మోసం చేశారని, సన్న బియ్యం ఇస్తానని పేదలను, మోసం చేశారని, వారంలో సీపియస్ రద్దు చేస్తానని ఉద్యోగులను మోసం చేశాడని, ప్రతి ఏటా అమ్మఒడి అమలు చేస్తానని, ఈ యేడు అమలు చేయకుండా విద్యార్థులను మోసం చేశాడని, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ వేస్తామని నిరుద్యోగ యువతను మోసం చేశారని, ఏటా 5 లక్షల ఇళ్ల నిర్మాణం చేస్తానని, మూడేళ్లలో ఒక్క ఇల్లు నిర్మించకుండా ఇల్లు లేని నిరుపేదలు మోసం చేశారని, 1000 దాటితే ఆసుపత్రిలో అయ్యే ఖర్చు అంతా తామే భరిస్తామని చెప్పి రాష్ట్ర ప్రజానీకం మొత్తాన్నీ మోసం చేశారని పేర్కొన్నారు. ఒక్క పరిశ్రమను రాష్ట్రానికి తేలేకపోయినా అసమర్థ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచారని, ఆంధ్ర రాష్ట్రం పేరు చెబితే పారిశ్రామికవేత్తలు పొరుగు రాష్ట్రాలకు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు.రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారని, 52 ఎకరాలలో తన హయాంలో కట్టించిన ఇళ్లను మూడేళ్లుగా శిథిలం చేశారని, అమృత్ పథకం నత్తనడకన సాగుతోందని, 100 పడకల ఆసుపత్రి ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రత్తిపాటి ప్రశ్నించారు. ఈ ఐదు సంవత్సరాలలో గతంలో నేను మంజూరు చేయించిన పనులకు రిబ్బన్ కత్తిరించినా చాలునని తెలిపారు. ఈ కార్యక్రమంలో తేళ్ళ సుబ్బారావు, నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, జమాల్ బాషా, పఠాన్ సమద్ ఖాన్, జరీనా సుల్తానా, అందెల శౌరి, అబ్దుల్ ఖుమీర్, అమరా రమాదేవి, అద్దంకి అనిత బాయ్, కౌన్సిలర్లు గంగా శ్రీను, కొత్త కుమారి, వార్డు నాయకులు గాలం కోటి, తనుబుద్ధి హరిబాబు రెడ్డి, మురకొండ మల్లిబాబు, షేక్ అజారుద్దీన్, గోపిదేశి గంగాధర్, తాటికొండ సుబ్బారావు, గోరంట్ల శ్రీను, కొత్త కోటేశ్వరరావు, మర్రిపూడి ప్రసాద్, కురిచేటి సాయిబాబా, బ్రహ్మం, సాయి, విక్రమ్, గోపిదేశి పోలేరు, గోపిదేశి వెంకటేష్, బాలయ్య, గోపిదేశి ప్రసాద్, కురిచేటి శ్రీను మరియు పార్టీ నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## 'మీలో ఎవరు లెజెండ్ బహుజన్" కార్యక్రమానికి రూ.50,000/-లు నగదు స్పాన్సర్ షిప్ ఇచ్చిన మంథని ఎమ్మెల్యే మరియు మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి) :బహుజనుల చరిత్రలు భావితరాలకు తెలియజేసే ఉద్దేశ్యంతో మాస్టర్ కీ (అంబేద్కర్) టివి ఛానల్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం "మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ప్రశ్న మాది లక్ష మీది" కార్యక్రమానికి మంథని ఎం ఎల్ ఏ మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,ఆయన కుటుంబ సభ్యులు 50 వేల రూపాయల స్పాన్సర్ షిప్ ను ప్రకటించారు. తన తండ్రి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ కీర్తిశేషులు శ్రీపాదరావు జ్ఞాపకార్థం ఇస్తున్నట్లు ప్రకటించారు. శ్రీపాదరావు జయంతి ఉత్సవాలలో శ్రీధర్ బాబు స్నేహ సంస్థల చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు ను "శ్రీపాదరావు స్మృతి" అవార్డుతో సత్కరించారు. ఆరోజే ఆయన లెజెండ్ బహుజన్ కార్యక్రమం గురించి డాక్టర్ శివ భాగ్య రావును అడిగి తెలుసుకున్నారు బహుజనులందరూ ఏకతాటిపైకి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఫ్రెండ్లీ గవర్నమెంటు దిశగా అధికారులు ముందుకు సాగాలి: సబ్ కలెక్టరు ఇలాక్కియా



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి:సోమవారం స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక స్పందన కార్యక్రమంలో సుమారు 30 అర్జీలను సబ్ కలెక్టరు ఇలాక్కియా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ స్పందన కార్యక్రమం వల్ల అర్జీదారులు ఎవ్వరూ కార్యాలయాల చుట్టూ పదే పదే తిరగాల్సిన అవసరంలేకుండా వారి పనులు గడువు దాటకుండా నిర్దిష్ట కాలవ్యవదిలో పరిష్కారం చేయాలన్నారు. అర్జీదారుల దరఖాస్తులు ఆన్ లైన్ లో కంప్యూటరీకరణ చేయడంవల్ల సమస్య పరిష్కార సరళిని తెలుసుకునే వెసులు బాటు ఉందన్నారు.ప్రతి సమస్యకు నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కారమార్గాలు చూపడం జరుగుతుందన్నారు. రాజానగరంమండల జి.ఎర్రంపాలెంకు చెందిన కోనే చంద్రావతి తన భర్తచనిపోయాడని వితంతు పించన్ కు ధరఖాస్తు చేసుకున్నానని ఇప్పటివరకు రాలేదని మరలా తన ధరఖాస్తు పున:పరిశీలించి వితంతు పించన్ ను ఇప్పించాలని సబ్ కలెక్టరు వారిని కోరారు. నగర పాలక సంస్థ పరిధిలోని 50 వ వార్డుకు చెందిన పిల్లి శ్యామలారావు అనే వికలాంగుడు తనకు టిడ్కో గృహ సముదాయంలో గృహం మంజూరు కాబడిందని కాని క్రింద బాగాన కాకుండా పైన కేటాయించారని తనకు క్రింద బాగంలోనే కేటాయించాలని సబ్ కలెక్టరు వారిని అభ్యర్థించారు. కోరుకొండ మండలం కాపవరం గ్రామానికి చెందిన ఎం పద్మ తన భర్త మరణించారని, జగనన్న భీమా పథకం ద్వారా బీమా పరిహారం రూ 2 లక్షలు మంజూరుకాబడిందని నిధులు మాత్రం జమ కాబడలేదని నిధులు జమ అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ఆమె సబ్ కలెక్టరు వారిని కోరారు. బోమ్మూరులోని మురళీకొండకు చెందిన సిహెచ్ వినిసెంటు తాను వికలాంగుడనని ఇంటరు వరకు చదివానని ఏదైన ఉద్యోగం లేదా ఉపాధినిసూచించాలని కోరారు. స్థానిక సుబ్బారావు పేటకు చెందిన రంగాల రవణమ్మకు గత నవంబరుమాసంలోప్రభుత్వం 5 కేజీల బియ్యం ఉచితంగా అందించిందని ఇపుడు సరఫరా కావడంలేదని ప్రతి నెల ఇప్పించాలనికోరారు. ఈ కార్యక్రమంలో కోనేరు రంగారావు కమీషన్ తాహసిల్దారు వేదవల్లి, గృహ నిర్మాణ సంస్థ ఇఇ జిసోములు, డివిజనల్ పంచాయితీ అధికారి జె సత్యనారాయణ, ల్యాబరు అధికారి గోదావరి కేశవరావుసహాయ సాంఘిక సంక్షేమ అధికారి ప్రసాద్ ఎంఎస్ఓ కె సూర్యప్రభాకరరావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ స్థంభాలు ఏర్పాటు



వినుకొండ (ప్రజాపాలన ప్రతినిధి):స్థానిక 19 వ వార్డు లోని రణ హుస్సేన్ పంజా బజారులో దశాబ్దాల క్రితం నాటి విద్యుత్ స్తంభాలు చిలుము పట్టి అధ్వాన స్థితికి చేరి ఏ క్షణాన విరిగి జనావాసాల మీద పడతాయో నని నిత్యం భయంతో గడుపుతున్న స్థానికులకు ఉపశమనం లభించింది.స్థానిక వార్డు కౌన్సిలర్ యమ్.ఎస్.కే.బాష పరిశీలించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి నూతన విద్యుత్ స్తంభాలు మరియు విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ బాష మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు , మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ షేక్ దస్తగిరి లకు వార్డు లో ఉన్నటువంటి సమస్య తెలియజేయగా వారు వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు.అనంతరం నూతన స్తంభాలు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న సమస్య నేటితో దూరమవడంతో వార్డు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు, మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దస్తగిరి ,వార్డు కౌన్సిలర్ యమ్.ఎస్.కే. బాష, విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## భక్తులకు మంచినీరు, ప్రసాదం పంపిణీ









వినుకొండ (ప్రజాపాలన ప్రతినిధి): నియోజకవర్గం లోని ఈపూరు మండలం బొగ్గరం గ్రామంలో వెలసినటువంటి శ్రీ ప్రసనాంజనేయ స్వామి వారి తిరునాళ్ళు మహెూత్సవం సందర్భంగావినుకొండ మాజీ శాసన సభ్యులు మరియు నరసరావుపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు జీ.వీ ఆంజనేయులు గారు స్థాపించిన శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలోతిరునాళ్లకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మంచినీటి పంపిణీ మరియు ప్రసాదం పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది.ప్రసాదాలు పంపిణీ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## సమిష్టిగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి: వైఎస్సార్సీపీ యువ నేత కరణం వెంకటేష్





చీరాల : సమిష్టిగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, వైఎస్సార్సీపీ యువ నేత కరణం వెంకటేష్ పిలుపు నిచ్చారు.చీరాల మండలం బుర్లవారిపాలెం పంచాయితీ , పిట్టువానిపాలెం పంచాయతీల్లో, రూ.30 లక్షల రూపాయల వ్యయం తో నూతనంగా నిర్మించనున్న సిమెంటు రోడ్లకు భూమిపూజ కార్యక్రమానికి,స్థానిక గ్రామ పెద్దలు, నాయకులతో కలిసి వైఎస్సార్సీపీ యువనాయకులు కరణం వెంకటేష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. స్థానిక రూరల్ నాయకులు బుర్ల వెంకటరావు నివాసంలో అల్పాహారాన్ని స్వీకరించి, ఆ గ్రామాల్లో ఉన్న, గ్రామ పెద్ద లతో, నాయకులతో, గ్రామస్తులతో మాట్లాడి, ఆ గ్రామంలో ఉన్న సమస్యలను , చేయవలసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి కరణం వెంక టేష్ గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కరణం వెంకటేష్ మాట్లాడుతూ, చీరాల నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసే విధం గా చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి కృషి చేస్తున్నారని, ప్రతి ఒక్కరితో కలసి సమిష్టిగా చీరాల నియోజకవర్గాన్ని సమగ్రం గా అభివృద్ధి చేసే విధంగా కృషి చేయాలి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీమంత్రి డాక్టర్ పాలేటి రామారావు , అర్బన్ డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు ,బుర్ల సాంబశివరావు ,బుర్ల వెంకట రావు , బుర్ల సుబ్బారావు, పిట్టు పోలయ్య ,బుర్ల చిన్న వెంకటేశ్వర్లు ,గవిని నారాయణ ,గవిని యానాదిరావు, సోములు ,ఆర్ బి కె చైర్మన్ కావూరి రమణా రేడ్డి , పి ఎ సి యస్ అధ్యక్షులు బోయిన కేశవులు, మల్లయ్య గారి వేంకట్రావు,పిట్టు రాజు, పులి శ్రీను, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు, చీరాల మున్సిపాలిటీ కౌన్సిలర్ లు ,నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు,స్థానిక గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

- గ్రామ సచివాలయంని ఆకస్మికంగా సందర్శించిన, వైఎస్సార్‌సీపీ యువనేత కరణం వెంకటేష్

చీరాల మండలం బుర్ల వారిపాలెం గ్రామ సచివాలయంని ఆకస్మికంగా సందర్శించి, సచివాలయ ఉద్యోగులతో మరియు వాలంటరీ లతో మాట్లాడుతూ, గ్రామంలో ప్రజలకు సక్రమంగా సేవలు అందిస్తున్నారా లేదా,సరైన సమయంలో సక్రమంగా స్పందిస్తున్నర లేదాఅని , ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలకి చేరుతున్నాయి లేదా అని వైఎస్సార్‌సీపీ యువనేత కరణం వెంకటేష్ బాబు వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు , గవిని శ్రీనివాస రావు ,బుర్ల సాంబశివరావు ,బుర్ల వెంకట రావు, బుర్ల సుబ్బారావు, పిట్టు పోలయ్య ,బుర్ల చిన్న వెంకటేశ్వర్లు ,గవిని నారాయణ, గవిని యానాదిరావు, సోములు ,కావూరి రమణా రేడ్డి , బోయిన కేశవులు, మల్లయ్య గారి వేంకట్ రావు,పిట్టు రాజు, పులి శ్రీను, నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకు లు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత తోనే ఉత్తమ పౌర సమాజ నిర్మాణం

## డాక్టర్ ధర్మవరం ఆషాదేవి, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్

స్త్రీలకు ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు, హక్కులు ఉంటాయని సమాజం పూర్తిస్థాయిలో గుర్తించటం లేదు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో పురుషులతో సమానంగా మానవ హక్కులు అనుభవించనీయకుండా స్త్రీ ఆంక్షలకు, లింగ వివక్షతకు గురవుతోంది. దాదాపు శతాబ్దానికి ముందు నుంచే ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు మార్చి 8వ తేదీని మహిళలకు ప్రత్యేక రోజుగా గుర్తిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్మిక ఉద్యమం నుంచి పుట్టుకొచ్చింది. దీనిని ఐక్యరాజ్య సమితి గుర్తించి, ఏటా నిర్వహిస్తోంది.దీని పుట్టుకకు బీజాలు 1908లో పడ్డాయి. తక్కువ పనిగంటలు, మెరుగైన జీతం, ఓటు వేసే హక్కు కోసం న్యూయార్క్ సిటీలో 15 వేల మంది మహిళలు ప్రదర్శన చేశారు. ఈ మహిళల డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909వ సంవత్సరంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. ఈ దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలన్న ఆలోచన క్లారా జెట్కిన్ అనే మహిళది. కోపెన్‌హెగెన్ నగరంలో 1910లో జరిగిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్' సదస్సులో ఆమె ఈ ప్రతిపాదన చేశారు. 17 దేశాల నుంచి ఈ సదస్సుకు హాజరైన 100 మంది మహిళలు క్లారా జెట్కిన్ ప్రతిపాదనను ఏకగ్రీవంగా అంగీకరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తొలిసారిగా 1911లో ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాల్లో నిర్వహించారు. 2011లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ శతాబ్ది వేడుకలు కూడా జరిగాయి. సాంకేతికంగా చెప్పాలంటే ఈ ఏడాది జరిగేది 111వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం.పనికి విలువ లేదు, జీతం ఉండదుమహిళలు చేసే ఇంటి పని, సేవలు, నిర్వహించే కుటుంబ బాధ్యత మొదలైనవన్నీ ఇంటి ఆర్థిక పరిస్థితికి వెన్నుదన్నుగా ఉంటూ కుటుంబాలను నిలబెడతాయి. కానీ ఇవేవీ కూడా అధికారికంగా "పని" అని గుర్తింపు పొందవు.మహిళలు చేసే పనికి ఎప్పుడూ విలువ ఉండదు. జీతం భత్యం లేని పని, పరిహారం చెల్లించక్కర్లేదు కాబట్టి బెంగ పడవలసిన అవసరం లేదు. అంతే కాకుండా, ఎల్లవేళలా అందుబాటులో ఉండే విషయం గా పరిగణిస్తారు.మహమ్మారి వలన ప్రపంచానికి ఒక విషయం బాగా తెలిసి వచ్చింది, మహిళలు నిర్వహించే కుటుంబ బాధ్యతలు, ఇంటి పని సామాజిక భద్రతకు కారణమని, మిగతావారు బయటికెళ్లి సంపాదించుకుని రావడానికి తోడ్పడుతున్నాయి అర్థమైంది. కానీ దీనికి చెల్లిస్తున్న మూల్యం చాలా విలువైనది, కుటుంబ సంరక్షణ భారాన్ని మోస్తున్న మహిళల అభివృద్ధి కుంటుపడింది. విద్య, ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయి. ఆనాటి స్త్రీ సంఘ సంస్కర్తలు సావిత్రీబాయీ ఫూలే, పండిత రమాబాయి, స్వర్ణకుమారీ దేవి, అరుణ అసిఫ్ అలీ మొదలుకొని నేటి మహిళా ఉద్యమకారిణి మేధా పట్కర్ స్ఫూర్తిని ప్రతి మహిళా ఆకళింపు చేసుకోవాల్సిన అవసరం ఉంది. దేశంలో స్త్రీలను కుల, మత, వర్గ, పార్టీలనే భేదం లేకుండా అందరినీ ఒకే తాటిపైకి తెచ్చేందుకు, వారి నైతిక, ఆర్థికాభివృద్ధికి తోడ్పడి మహిళా సాధికారత వైపు కృషి చేయాలి. ఆజాది కా అమృత్ మహోత్సవాలు జరుపుకుంటున్నాం కానీ ప్రతి నిత్యం జరిగే గృహ హింస, లైంగిక వేధింపులు, భ్రూణ హత్యలు, పరువు హత్యలకు చరమగీతం పాడలేకపోతున్నాం.

## వేసవికాలం దృష్ట్యా మంచి నీటి సమస్య లేకుండా చూడాలి: మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేట :(ప్రజా పాలన)పట్టణం లోని స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు మున్సిపల ఛైర్మన్ మరియు ఇన్చార్జి కమిషనర్ అధ్యక్షతన మంచి నీటి సమస్యలపై ప్రజలు ఇబ్బంది పడకుండా ఏప్రిల్, మే, జూన్, జూలై ఈ నాలుగు నెలలు మరిముఖ్యంగా మంచినీటి సమస్య రాకుండా చూడాలని పట్టణంలోని వివిధ ప్రాంతాలలో లికులను పరిశీలించాలని, మంచినీటి ట్యాంక్ లను సమస్యలున్నా ప్రాంతాలకు పంపించాలని, పట్టణంలోని ప్రజలు మంచి నీటి సమస్య పై ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫ్ఫాని ఆదేశించారు. అంతేకాకుండా వార్డు లోనే పలు సమస్యలపై స్థానిక కౌన్సిలర్ ద్వారా కార్యాలయంనికి తెలియజేయాలని చెప్పారు. సచివాలయం ఉద్యోగులు, లైన్మెన్ లు, ఇన్స్పెక్టర్లు, ఏఈ లు, మున్సిపల్ కమిషనర్ రహీమ్ వారితో మీటింగ్ ఏర్పాటు చేసి మంచి నీటి సమస్యలపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో 15వ వార్డ్ కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, 33 వ వార్డు ఇన్ చార్జ్ కిషోర్ , 34 వార్డు కౌన్సిలర్ కోటా నాయక్ , 32 వ వార్డు కౌన్సిలర్ రాజేంద్ర , పలువురు అధికారులు పాల్గొన్నారు.

## జెఎన్‌టియు విసి ను మర్యాదపూర్వకంగా కలిసిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి



కాకినాడ : ప్రజాపాలన ప్రతినిధి: యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జి. వి. ఆర్. ప్రసాద్ రాజు గారిని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి బృందం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.యూనివర్సిటీ అభివృద్ధి పనులు, విద్యార్థుల విషయాలను, పలు అంశాలను ఇరువురు మాట్లాడుకోవడం జరిగింది.వీరితో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు జి. లోవరత్నం, జిల్లా సమితి సభ్యులు బొమ్మసాని రవి చంద్ర, శివ కోటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పై హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలి

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జే.వి.వి.సత్యనారాయణ మూర్తి**




రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి : ఆంధ్ర ప్రదేశ్ రాజధానిగా అమరావతి ని కొనసాగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జే. వి. వి సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో అమరావతి అంశం చర్చకు రానున్న నేపథ్యంలో పరిపాలన సౌలభ్యం అదే విధంగా అభివృద్ధి కోసం పంతాలకు పట్టింపులకు పోకుండా అమరావతి రాజధాని కొనసాగించాలని అన్నారు. అమరావతి రాజధాని విషయంలో సిపిఐ ఆదినుండి రైతులకు అండగా నిలబడింది అని గుర్తు చేశారు. వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసు కు సంబంధించి సిబిఐ దర్యాప్తు జాప్యం జరుగుతుందని కోర్టు జోక్యం చేసుకుంటే గాని సీబీఐ ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడటం. అదేవిధంగా ఇటీవల పలు కథనాలు కు సంబంధించి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ అసెంబ్లీలో లో అన్ని ప్రస్తావించడం ప్రస్తావించే అవకాశం ఉన్నందున అసెంబ్లీ సమావేశాలు సజావుగా నడుస్తాయి అనే నమ్మకం లేదన్నారు. ఇప్పటికైనా ఈ కేసులో నిజానిజాలు విచారించి కేసు దర్యాప్తు సజావుగా జరిపి చార్జిషీటు దాఖలు చేసి ఊహాగానాలకు తెర దించాలని హితవు పలికారు.పార్లమెంటు చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో చట్టం చేయడం చట్టం చేయడానికి లేదని న్యాయస్థానం చెబుతుంటే పార్లమెంట్లో ప్రశ్నిస్తే రాజధాని ఎక్కడ ఏర్పాటు చేయాలనే హక్కు రాష్ట్రాన్ని నిర్ణయించుకుందని. రాజధాని విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తెలియజేయాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లా భ్రమరాంబ, కొండలరావు, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు బొమ్మసాని రవిచంద్ర, సేపేని రవణమ్మ, ఏఐటీయూసీ నగర కార్యదర్శి కిర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఒంగోలు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రకాశంజిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం కార్పొరేషన్ పారిశుద్ధ మహిళా కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర మేయర్ గంగాడ సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో మహిళ ఒక శక్తిగా ఎదిగిందని గుర్తు చేశారు. ఆకాశమే హద్దుగా రాకెట్లను కూడా నడుపుతున్నారని తెలిపారు. అన్ని రంగాలలో పురుషులతో సమానంగా మరి కొన్ని రంగాలలో పురుషుల కంటే ఎక్కువగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పారిశుద్ధ కార్మికులు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా వారి ఆరోగ్యాలను కూడా కాపాడుకోవాలని సూచించారు. కమీషనర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలలో మహిళలకు పెద్దపీట వేస్తుందని గుర్తు చేశారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వారి ఆరోగ్యాలను కాపాడేందుకు అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేసిందన్నారు. మహిళలందరూ స్వయంశక్తితో ఎదగాలని సూచించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆయుష్ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టర్ పద్మ జాతి, డాక్టర్ బ్రమరాంబ, వైద్యులు వి శిరీష, ప్రియాంక, ప్రసన్నలక్ష్మి, రత్నావళి,విమల,సౌజన్య, అసిస్టెంట్ కమిషనర్ డి.ఈ. సచివాలయ శానిటేషన్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం



వినుకొండ (ప్రజాపాలన ప్రతినిధి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో స్వామి సేవకులైన జాజుల మల్లేశ్వరి, బత్తుల రాజేశ్వరి, జాజుల మాల్యాద్రి, ఆలయ ప్రధాన అర్చకులు శివ కుమార్, ఆధ్వర్యంలో పాఠశాలలోని మహిళ ఉపాధ్యాయులకు బాలికల సమక్షంలో ఏర్పాటుచేసిన కేకును కట్ చేశారు. అనంతరం ఆలయ సేవకులు చేతుల మీదగా దుస్సలవలతో పూలమాలలతో అత్యంత వైభవంగా ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు కె నాగలక్ష్మి, మాట్లాడుతూ సృష్టిలో సగ భాగమైన మహిళలను గౌరవించడం బాలికలను ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ రాళ్లను సన్మానిస్తున్న నరసింహ స్వామి వారి దేవస్థానం సేవకులు జాజుల మాల్యాద్రి ని ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం ఈ కార్యక్రమానికి సన్మాన గ్రహీతలు రెడ్డి నాగ పద్మ ,గౌరీ, అన్నపూర్ణ ,నాగలక్ష్మి, దయామని ,రమాదేవి, సుభాషిని ,ముంతాజ్ బేగం, ఎలిజిబెత్ రాణి ,పద్మ, వీరందరిని సన్మానించారు. తదితర భక్త బృందం పాల్గొన్నారు.

## మహిళా కౌన్సిలర్ సలోమిపై దాడి చేసిన జంగా సురేష్ పై చర్యలు తీసుకోవాలి



ప్రజాపాలన ప్రకాశంజిల్లా ప్రతినిధి... గత కొద్దిరోజుల క్రితం చీరాల మున్సిపల్ కౌన్సిలర్ సలోమిపై దాడిచేసిన ఘటనలో జంగా సురేష్ పై నాన్ బెయిలబుల్ సెక్షన్ క్రింద కేసునమోదు చేయాలని జిల్లా ఎస్పీ మాలికా గార్గ్ ను చీరాల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ సీనియర్ నేత ఆమంచి కృష్ణ మోహన్ సోమవారం కలవడం జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సలోమీపై దాడి విషయంలో ఈ స్టేషన్లో పనిచేస్తున్న ఏఎస్పై కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఈ విషయాన్ని జిల్లా ఎస్పీని కలిసి వివరించడం జరిగిందని ఎస్పీ కూడా సానుకూలంగా స్పందించడం జరిగిందని తెలిపారు. అమరావతినే రాజధానిగా ఉండాలని ఏనాడూ కమ్యూనిస్టులు, మీడియా ఎప్పుడూ అడగనేలేదు. చంద్రబాబు హైదరాబాద్ నుండి అమరావతికి ఎందుకు వచ్చారనేది కమ్యూనిస్టులు చంద్రబాబుని అడిగితే బాగుండేది. రాష్ట్ర విభజన తరువాత ఏపీకి తీరని అన్యాయం జరిగింది. నేటి నుండి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు టీడీపీ అధినేత చంద్రబాబు కూడా వెళితే బాగుండేది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని టీడీపీ నేతలు పరోక్షంగా ఒప్పుకున్నట్లే. రాజధాని ఎక్కడ ఉండాలి అనేది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న విషయం. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లొచ్చని ఆయన తెలిపారు.

## ప్రకాశంజిల్లాలో దారుణహత్య



ప్రజాపాలన ప్రకాశంజిల్లా ప్రతినిధి.. ప్రకాశం జిల్లా దర్శి మండలం నడింపల్లి కొత్తూరు వద్ద ఓ యువకుడి పై కొందరు వ్యక్తులు కత్తితో దారుణంగా దాడికి పాల్పడ్డారు...తీవ్ర గాయాలపాలైన యువకున్ని దర్శి ప్రభుత్వ హాస్పిటల్ కి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.ఈ ఘటనపై ఎస్ఐ చంద్రశేఖర యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం....దర్శి మండలం వెంకటచలం పల్లి పంచాయితీ నడింపల్లి గ్రామం లో పుప్పాల సత్యనారాయణ అనే యువకుడిపై కొందరు వ్యక్తులు దానికి పాల్పడగా,యువకుడు మృతి చెందాడని,ఈ ఘటన పై మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## వంట నూనెలు/ వంట నూనె గింజల వ్యాపారులపై విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారుల తనిఖీలు



వినుకొండ (ప్రజాపాలన ప్రతినిధి ): వంటనూనెలు అక్రమ నిల్వలు మరియు ధరల పెరుగుదలను అరికట్టటానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ జనరల్ వారి ఆదేశాల మేరకు వరుసగా రెండవ రోజు ది.07.03.2022 న గుంటూరు జిల్లాలో రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారి శ్రీ ఎస్.వి. మాదవ్ రెడ్డి గారి పర్యవేక్షణలో జిల్లాలోని సత్తెనపల్లి, వినుకొండ పట్టణం లో వంటనూనెలు, వంటనూనె గింజలు అక్రమంగా నిల్వచేసి అధికధరలకు అమ్ముచ్చున్న పలు వ్యాపార స్థావరాలు మరియు గోదాములపై విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు స్థానిక పౌర సరఫరాల శాఖ మరియు తూనికలు కొలతల శాఖ అధికారులతో కలసి తనిఖీలు నిర్వహించుచున్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం



విశాఖపట్నం: ప్రజాపాలన ప్రతినిధి: విశాఖలో పేదల పెన్నిదిగా నిలిచిన లక్ష్మీ గాయత్రీ హాస్పిటల్ యాజమాన్యం నిరంతరం సేవా కార్యక్రమాలతో సేవా దృక్పదాన్ని చాటుకుంటోంది.నగర పరిదిలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ వైద్య శిభిరాలను ఏర్పాటు చేసి అధునాతన వైద్యాన్ని గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తోంది.దీంట్లో బాగంగా లక్ష్మీ గాయత్రీ హాస్పిటల్ ఎండీ డా.కాంద్రేగుల వెంకట రామ్‌కుమార్ సహాయ సహకారంతో విశాఖ 44వార్డు నందగిరినగర్ లో గణేష్ సేవా సంఘం ఆద్వర్యము లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.సుమరు 100మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు.వీరికి అవసరమైన వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఉచితం గా అందించారు.వైద్య సేవలను అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఆసుపత్రి యాజమాన్యం నిర్వహించిన ఉచిత వైద్య శిభిరం ద్వారా అవసరమైన సేవలను పొందారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ గాయత్రి హాస్పిటల్ సిబ్బంది ఈశ్వరరావు. కోటి .సురేష్ తదితరులు పాల్గొన్నారు.




"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?
ప్రశ్న మాది - లక్ష మీది

నేటికీ సమాజంలో గౌతమ బుద్ధ , జ్యోతిరావు ఫూలే, డాక్టర్ అంబేడ్కర్, బాబు జగజీవన్ రామ్, బీ పీ మండల్ , షేక్ ఫాతిమా, సురవరం ప్రతాపరెడ్డి , త్రిపురనేని రామస్వామి చౌదరి , రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు అంటే ఎవరో అని తెలియని వాళ్ళు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు రాజకీయ నాయకులు బహుజన మహనీయుల చిత్రపటాలను చూసి ఎవరు వీళ్ళు అని ప్రశ్నించిన సందర్భాలు నెలకొన్నాయి.

మన బహుజన సామాజిక స్ఫూర్తిదాతల చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి మరుగున పడిపోవడంవల్ల భావితరాలకు స్ఫూర్తి మరియు దేశాభివృద్ధిలో పురోగతి ఉండదు. అందువల్ల అన్ని కులాలలోని మహానుభావుల చరిత్రను ప్రపంచానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ టీవీ (అంబేడ్కర్ టీవీ) ఛానల్ లో

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?"
ప్రశ్న మాది - లక్ష మీది

అనే ఒక సరికొత్త ప్రోగ్రాం ను ప్రారంభించబోతున్నాం.
ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ స్పాన్సర్ చేసిన వారి వివరములు :

1. డాక్టర్ కె వరప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపల్, స్నేహ క్లబ్ గవర్నర్,బాపట్ల, Rs 1,000/-
2. మండే ప్రభాకర్ రావు, జడ్పీ స్కూల్ అసిస్టెంట్, బాపట్ల, Rs 1,000/-
3. గోగులమూడి మరియన్న, హైదరాబాద్ Rs 1,000/-
4. జి రవి, మౌలాలి, హైదరాబాద్ Rs 2,000/-
5. దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంథని నియోజక వర్గ శాసనసభ్యులు మరియు మాజీ మంత్రి (తండ్రి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ స్పీకర్ కీర్తిశేషులు శ్రీపాద రావు జ్ఞాపకార్థం) Rs 50,000/-

స్పాన్సర్ చేసిన వారికి ధన్యవాదములు

ఈ ప్రోగ్రాంకు స్పాన్సర్ చేయదలిచిన వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు

మా అకౌంట్ వివరాలు :

Cell No. 9110795033

మీరు Sponsorship amount ను Jai B Bhoomi News Channel Limited - A/c. No: 38072051879 , IFSC : SBIN0005893, State Bank of India,Bazarghat Branch,Hyderabad
అకౌంట్ కు పంపించిన కౌంటర్ ఫైల్ తో పాటు మీ వివరాలు పోస్ట్ ద్వారా లేక masterkeytv234@gmail.com ఈ మెయిల్ కు పంపించగలరు.

# ప్రజాపాలన

సంపాదకీయం

మంగళవారం 08, మార్చి 2022


# యుద్ధమూ... శాంతి

యుద్ధం ఎక్కడ జరిగినా, ఎప్పుడు జరిగినా, ఎందుకు జరిగినా మానవాళికి తీరని నష్టం తప్పదు. ఇందుకు ఎన్నో అనుభవాలు ఇప్పటికే ఉన్నాయి. గడచిన యుద్ధాలు చేసిన గాయాల మచ్చలింకా మిగిలే ఉన్నాయి. అయినా ఇప్పటికీ యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. 'యుద్ధం ఎప్పుడు వచ్చినా, తొలుత మరణించేది సత్యమే' అన్నాడు అమెరికన్ రాజనీతిజ్ఞుడు హైరమ్ వారెన్ జాన్సన్. చరిత్రలో యుద్ధాలతో గడిచిన కాలమే ఎక్కువ. యావత్ ప్రపంచం అంతటా శాంతి పరిఢవిల్లిన కాలం చాలా తక్కువ. లోకంలో ఎందుకు శాంతికి కరవు ఏర్పడుతోందంటే, 'పగవృద్ధి బొందించు భ్రష్టులే కాని/యడగించు నేర్పరు లవనిలో లేరు' అని 'పలనాటి వీరచరిత్ర'లో కవిసార్వభౌముడు శ్రీనాథుడు ఏనాడో కుండబద్దలు కొట్టాడు. అంతేకాదు, 'పోరు మంచిదికాదు భూమినెక్కడను/పాడౌను దేశంబు పగమించెనేని' అని హితవు పలికాడు. యుద్ధోన్మాదం తలకెక్కిన నియంతలకు, మిథ్యాపౌరుషాలతో పిచ్చిపట్టిన పాలకులకు ఇలాంటి హితోక్తులు రుచించవు. వాళ్ల ఆధిపత్యమే వాళ్లకు ముఖ్యం. వాళ్ల చండశాసనాలు చలామణీ కావడమే వాళ్లకు ముఖ్యం. ప్రపంచంలో ఏదో ఒక దేశం సహేతుకంగానో, నిర్హేతుకంగానో మరో దేశం మీదకు దండెత్తుతుంది. దండయాత్రకు గురైన దేశం అనివార్యంగా ఆత్మరక్షణ కోసం యుద్ధంలోకి దిగుతుంది. అలా మొదలైన యుద్ధం ఎన్నాళ్లు సాగుతుందో, ఎన్నేళ్లు సాగుతుందో ఎవరూ అంచనా వేయలేరు. యుద్ధం ముగిశాక చూసుకుంటే రెండు దేశాల్లోనూ సామాన్య పౌరులకు మిగిలేది అంతులేని విషాదమే! ఉక్రెయిన్‌పై రష్యా ప్రస్తుతం యుద్ధం కొనసాగిస్తున్న నేపథ్యంలో మూడో ప్రపంచయుద్ధం ముంచుకొచ్చే ప్రమాదం లేకపోలేదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతపనే గనుక జరిగితే, అప్పుడు జరగబోయే అనర్థాలను ఎవరూ అంచనా వేయలేరు. 'మూడో ప్రపంచయుద్ధంలో ఏ ఆయుధాలతో పోరు జరుగుతుందో నాకు తెలీదుగాని, నాలుగో ప్రపంచయుద్ధంలో మాత్రం కర్రలు, రాళ్లతోనే పోరు జరుగుతుంది' అన్నాడు ఐన్‌స్టీన్. ఒకవేళ మూడో ప్రపంచయుద్ధమే గనుక జరిగితే, ఆ యుద్ధంలో జరిగేది నాగరికతా వినాశనమేనని ఆయన అంచనా. నాగరికత నశించాక మనుషులకు కొట్టుకోవడానికి మిగిలేవి కర్రలు, రాళ్లే! ఆధిపత్య వాదులు, నిరంకుశ నియంతలు తప్ప సామాన్యులెవరూ యుద్ధాలను కోరుకోరు. యుద్ధాల్లో పాల్గొనే సాధారణ సైనికులు సైతం స్వభావసిద్ధంగా శాంతికాముకులుగానే ఉంటారు. విధి నిర్వహణ కోసం తప్ప ఉత్తపుణ్యానికే వారెవరితోనూ కయ్యానికి కాలుదువ్వరు. 'వయసు మళ్లిన వాళ్లు యుద్ధాలను ప్రకటిస్తారు. అయితే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు పోగొట్టుకునేది యువకులే' అన్నాడు అమెరికన్ రాజనీతిజ్ఞుడు హెర్బర్ట్ హూవర్. నాగరికతలు మొదలైన నాటి నుంచి యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. క్రీస్తుకు పూర్వం శతాబ్దాల కిందటి నుంచే కళా సాహిత్యాలలో యుద్ధం ప్రభావం కనిపిస్తుంది. యుద్ధం వల్ల అనర్థాలు తప్ప ఒరిగేదేమీ ఉండదని ఎందరో కవులు, రచయితలు, తత్త్వవేత్తలు చెబుతూనే వస్తున్నారు. మొదటి ప్రపంచయుద్ధానికి చాలాకాలం ముందే రష్యన్ రచయిత లియో టాల్‌స్టాయ్ 'వార్ అండ్ పీస్' నవల రాశాడు. యుద్ధాలకు ఉవ్విళ్లూరే పాలకుల ధోరణిని ఎత్తిపొడుస్తూ, 'రాజులు చరిత్రకు బానిసలు' అని ఆయన తేల్చాడు. యుద్ధాల్లో మంచి యుద్ధాలు, చెడ్డ యుద్ధాలు అంటూ ఏవీ ఉండవు. ఎలాంటి యుద్ధమైనా అది ఒక సామూహిక మానవ హననకాండ. 'ఎంత అవసరమైనా సరే, ఎంత సమర్థనీయమైనా సరే యుద్ధం నేరం కాదనుకోవడం తగదు' అని అమెరికన్ రచయిత ఎర్నెస్ట్ హెమింగ్వే అన్నట్లు ఎలాంటి యుద్ధమైనా, అది మానవాళి పట్ల నేరమే! ఈ భూమ్మీద యుద్ధం జరగని చోటంటూ ఏదీ లేదు. 'రణరంగం కానిచోటు భూ/స్థలమంతా వెదకిన దొరకదు/ గతమంతా తడిసె రక్తమున/ కాకుంటే కన్నీళులతో' అన్నాడు శ్రీశ్రీ. ప్రత్యక్ష యుద్ధాలు, ప్రచ్ఛన్న యుద్ధాలు, అంతర్యుద్ధాలు ఇలా రకరకాల యుద్ధాలు ఎక్కడో ఒకచోట ఏదో ఒక రూపంలో జరుగుతూనే ఉన్నాయి. యుద్ధంలో గెలిచిన పక్షమే సరైనదని నిర్ణయించలేం. యుద్ధం ముగిసీ ముగియడంతోనే శాంతి వెల్లివిరుస్తుందనుకోవడం భ్రమ! యుద్ధం ముగిశాక మనుషుల మధ్య సామరస్యాన్ని కాపాడుకోగలిగినప్పుడే శాంతి స్థాపనకు ఆస్కారం ఏర్పడుతుంది. 'యుద్ధంలో గెలుపు సాధించడంతోనే సరిపోదు. శాంతిని నెలకొల్పి, దానిని కాపాడుకోవడం ముఖ్యం' అన్నాడు గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్. ఇప్పటికే జరిగిన రెండు ప్రపంచయుద్ధాలు మానవాళికి అనేక గుణపాఠాలు నేర్పాయి. రెండో ప్రపంచయుద్ధం ముగిశాక ఐక్యరాజ్య సమితి ఏర్పడింది. శాంతిని ఉల్లంఘించే దేశాలపై చర్యలు తీసుకునేందుకు అంతర్జాతీయ కోర్టు ఏర్పడింది. శాంతి స్థాపన కోసం అంతర్జాతీయ చట్టాలు అమల్లోకి వచ్చాయి. ప్రపంచశాంతి కోసం ఇంతటి వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న తర్వాత కూడా యుద్ధాలు జరగడం ఆగట్లేదు. 'రెండు యుద్ధాల నడుమ విరామ కాలమే శాంతి' అన్నాడు బ్రిటిష్ ఆర్థికవేత్త రాల్ఫ్ హాట్రే. అయితే, యుద్ధాలు సమసిపోయిన తర్వాత కూడా చాలాచోట్ల ఉద్రిక్తతలు కొనసాగే పరిస్థితులు ఉన్నప్పుడు వర్తమాన ప్రపంచంలో శాంతి అనేది ఒక ఎండమావి! బలిసిన దేశాలు ఒకవైపు శాంతి ప్రవచనాలు చెబుతూనే, మరోవైపు అణ్వాయుధ సంపదను పోగేసుకుంటూ, ఆయుధ వ్యాపారాలు సాగిస్తున్న నేపథ్యంలో ప్రపంచశాంతి ఎంతమేరకు సాధ్యమవుతుందో చరిత్రే చెప్పాలి మరి!

# లాలించే చేయి ..పాలించే పగ్గాలను పట్టే రోజు?!



ఇంద్రాణి మామిడిపెల్లి

"లింగ సమానత్వ వ్యవస్థాపనే సుస్థిర భవిష్యత్తుకు సోపానం" అన్న నేపథ్యాన్ని ఈ సంవత్సరం ఐక్యరాజ్య సమితి, మార్చి 8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రకటించింది. 1911 నుండి ప్రపంచ వ్యాప్తంగా ఈ రోజున ,మహిళలు సామాజికంగా, సాంస్కృతికంగా, సాంకేతికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సాధించిన ఘనతలను గణించి ఘనంగా జరుపుకుంటున్నారు. ఎక్కడ వెనుకబడి పోతున్నామో తెలుసుకుంటేనే , దాన్ని గుర్తించి అక్కడ ముందడుగు వేయగలిగే ప్రయత్నాలు చేస్తాము. సాధించిన వాటికి సంతోషపడటం తో పాటు, లొసుగుబాట్లు ఉన్నచోట ఇంకా సాధన చేయాల్సిన అవసరం కూడా ఉంది. సమస్త సృష్టి యొక్క ఆలనా, లాలనా చూసే అమ్మతనం, ప్రతీ రంగంలో పాలనా విషయంలో మాత్రం ఇంకా వెనక్కే పరుగులు పెడుతోంది. గణాంకాలను చూస్తే మహిళా సాధికారిత అనే కళ సాకారం ఇంకా చాలా దూరంగానే కనిపిస్తుంది. 2011 ప్రకారం ప్రపంవ్యాప్తంగా 49.6% మహిళా జనాభా కలదు. మహిళా అక్షరాస్యత 82% మరియు పురుషుల అక్షరాస్యత 90%. అదే మన భారత దేశ విషయానికొస్తే 48.5% మహిళా జనాభా ఉండగా అందులో 65% అక్షరాస్యులుగా ఉన్నారు. పురుషులు 82% అక్షరాస్యత కలిగి ఉన్నారు. పురాణ పఠనాల్లో, వేదాల ప్రసంగాల్లో మహిళకు సమాన గౌరవం, ప్రాముఖ్యం, ప్రత్యేకత లభించిందని తెలుసుకున్నప్పుడు బాగానే ఉన్నాయి. కానీ నిజ జీవితంలో ఆ మాటలు కొన్ని ప్రాంతాలకు, కొందరు ప్రముఖులకు మాత్రమే పరిమితమై కూర్చున్నాయి.

**మహిళా సాధికారిత ప్రాముఖ్యం:**

ప్రాచీనకాలం నుండి మహిళా హక్కులు, వారి యొక్క సుస్థిరత, దీర్ఘకాలిక అభివృద్ధి కోసం సమాజం కృషి చేస్తానే వుంది. ప్రపంచవ్యాప్తంగా 43% మహిళా జనాభా వ్యవసాయ రంగంలోనే ఉన్నారు. ఇంటిని చక్కబెట్టి, పిల్లలకు మొదటి గురువుగా మారి, ఇంటా బయటా అన్నీ తానై జాతీయ ఉత్పత్తి లో పరోక్షంగా ఎన్నో రకాలుగా పాలు పంచుకుంటున్నారు. 2012లో ఉన్న మహిళా జనాభాలో కేవలం 27% యువతులు మాత్రమే ఏదో ఒక ఉద్యోగంలో ఉన్నారు, అదే 2005 లో ఆ సంఖ్య 79% . ఏకంగా 20 మిలియన్ల మహిళలు (శ్రీలంక మొత్తం జనాభాకు సమానం) కార్మిక శక్తి నుండి తప్పుకున్నారు. ఒకవేళ పురుషులతో సమానంగా కార్మిక శక్తిలో పాలుపంచుకుంటే దేశ జీడిపి ఇప్పుడు ఉన్నదానితో పోలిస్తే 27% పెరిగే అవకాశం ఉందని IMF అంచనా వేసింది. ఒక యువతికి సామాజిక సాధికారిత అవసరం. తనకు సంబంధించిన నిర్ణయాలు,ఆరోగ్యపరమైన విషయాల్లో, ఆస్తి కొనుగోళ్లు, లావాదేవీలు, భవిష్యత్తు, విద్యా- వైద్యం, పెళ్లి, పిల్లలు,గర్భాధారణ, మొదలైన వాటిల్లో వారి సాధికారిత మెరుగు పడాలి. ప్రపంచంలో అధికంగా పితృస్వామ్య వ్యవస్థ ప్రభలంగా ఉండడం చేత అవేవీ యువతి చేతుల్లో లేవు. HDI ప్రకారం 2016 లింగ సమానత్వ సూచీలో 159 దేశాలలో మన దేశానికి 125 వ స్థానం. భారత రాజ్యాంగం ఆర్టికల్ 14 చేత అందరికీ సమానంగా బ్రతికే హక్కు, ఆర్టికల్ 21 చేత వ్యక్తిగత స్వేచ్ఛా కల్పించింది. కానీ ఆ భాగ్యం ఎందరో అభాగ్యులకు అందని ద్రాక్షే. ఒక ఆడది ఆర్థికంగా నిలదొక్కుకోవడం తన ఆత్మ గౌరవానికి , స్వతంత్రతకు చాలా ముఖ్యం. ప్రకృతి వనరులు, ఆస్తి, ఆదాయం , ఆర్థిక స్థితి మొదలైనవి సమానంగా పొందే హక్కులు కల్పించండంలో కూడా వ్యవస్థలు విఫలం అవుతున్నాయి. మహిళలు ఇంట్లో చేసే పనికి ఎటువంటి ఆదాయం కల్పించబడదు, ఎక్కువ మంది మహిళలు ఇంటి పనులమీదే ఉంటారు కాబట్టి కర్మిక శక్తిలో వారి ప్రాతినిధ్యం తక్కువే, GDPలో వారి సహకారం తక్కువే. పని ప్రదేశాల్లో వారికి ఇబ్బందులు, లైంగిక వేదింపులు, అసమాన వేతనాలు, సంప్రదాయక కుటుంబాలలో ఇంటి బయట పనికి నిరాకరణ వంటివి ఇప్పుడున్న సమాజంలో ఇంకా ప్రభలంగానే ఉన్నాయి. ఒక మహిళ రాజకీయ పరమైన విషయాలలో సాధికారిత సాధించంచడం సమాజ సమతుల్యాన్ని , సక్రమమైన నిర్ణయాలు తీసుకోవడానికి, వాటిని అమలు పరచడానికి అవసరం. ఇంటి పని తప్ప, రాజకీయానికి పనికి రారని , భౌతికంగా బలహీన పరులని, అన్ని పనులూ వారితో కావనే భ్రమలో ఉన్నవాళ్లు, స్త్రీ ఆధిక్యాన్ని ఓర్వలేని వారు అభివృద్ధికి అడ్డంకులు వేసే వారే. రాజకీయ పార్టీ టికెట్ల విషయంలో వివక్షలు చూపిస్తారు. దేశ జనాభాలో సగమున్నా, పార్లమెంట్ ప్రాతినిధ్యంలో 14% మాత్రమే ఉన్నారు. సార్వత్రిక వయోజన ఓటు హక్కు సాధించి ఐదు దశాబ్దాలు గడిచినా ప్రజాస్వామ్య ప్రాతినిధ్యంలో మాత్రం అంత గొప్పగా మెరుగు పడలేదు. 2013 లో 11% లోక్ సభలో మరియు 10% మాత్రమే రాజ్య సభలో మహిళలు అధికారం చేపట్టారు .243వ రాజ్యాంగ అధికరణ సవరణతో మహిళలకు పంచాయతీరాజ్ ఇన్స్టిట్యూషన్ లో 33% రిజర్వేషన్ నుండి 50% కి పెంచారు. దీనిద్వారా మధ్యప్రదేశ్, కేరళ, రాజస్థాన్, ఛత్తీస్గఢ్, వంటి రాష్ట్రాల్లో రాజకీయంలో మహిళా ప్రాతినిధ్యం మెరుగు పడింది. కానీ మిగిలిన రాష్ట్రాలకు రిజర్వేషన్ యొక్క లాభం అందనే లేదు. న్యాయ పరమైన విషయాలలో, పదవులలో కూడా మహిళలు చాలా తక్కువగా ఉన్నారు. దిగువ న్యాయస్థానాలలో కేవలం 33% మహిళలు మాత్రమే ఉన్నారు, ఎగువ న్యాయస్థానాలలో 11.5% మత్రమే పదవిలో ఉన్నారు. మన దేశ ఉన్నత న్యాయాధిపతి గారు ఈ విషయంలో అసంతృప్తి వ్యక్తపరిచారు. సుప్రీం కోర్టులో మొత్తం 33 న్యాయాధికారులు ఉండగా కేవలం నలుగురు మాత్రమే మహిళలు అని ఒక సందర్భంలో వాపోయారు. యూఏఈ యొక్క భారత రాయబారి మహ్మద్ అల్బన్న ఈ మధ్యే జరిగిన సభలో , తన ఎంబసీ సిబ్బందులలో 50% మహిళలే ఉన్నారని, అంతే కాక ఫెడరల్ కౌన్సిల లో 30% మరియు యూఏఈ క్యాబినెట్ లో కూడా 30% మహిళలే ఉన్నారని గర్వంగా పేర్కొన్నారు. అటువంటి దేశాలను ఆదర్శంగా మన భారతం తీసుకోవాలి. ఈ మధ్యే విడుదల చేసిన NFHS( నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే) లో అమ్మాయిలలో పోషకాహార లోపం ఎక్కువగా ఉందని తేల్చింది. మహిళల మరణాల రేటు 1000కి 40మంది, మరియు పురుషులది 38.4 ఉంది. 2011 లో 74.84 మిలియన్ భ్రూణ హత్యలు జరిగాయి. బాల్య వివాహ చట్టాలు ఉన్నా, పోయిన సంవత్సరం జరిగిన పెళ్లిళ్లలో సగం కంటే ఎక్కువ బాల్యవివాహాలే. కారోన దానికి ప్రధాన కారణంగా చెప్పొచ్చు. ఈ మధ్యే మహిళా వృద్ధుల సంఖ్య సంఖ్య పెరుగుతుందని గణాంకాలు చెప్తున్నాయి. ఎక్కువ మంది నిరక్షరాస్యులు గా ఉండడం మూలంగా వారి కాళ్ళమీద వారు నిలువలేక పోతున్నారు. పౌష్టికాహారం లేక దుర్భర జీవితం గడిపే పరిస్థితులు నెలకొన్నాయి. ముందుకు వెళ్ళడానికి ఎన్నో అడ్డంకులు కానీ అవ్వన్నీ గుర్థంపబడని అడ్డంకులు. ప్రపంచ ఆర్థిక ఫోరం ప్రాకారం లింగ అంతరాలు ప్రతీ సంవత్సరం 3% పెరుగుతుందని తెలిసింది. వీటితో పాటు ఆడవారి మీద జరిగే అఘాయిత్యాలకు హద్దూ పద్దూ లేకుండా పోతుంది. NCRBని అనుసరించి ప్రతీరోజు సగటున 88 మానభంగాలు జరుగుతున్నాయని 2019 లో తెలిపారు. గృహహింస గురయ్యే ఆడవారి సంఖ్య కూడా ఎక్కువే. పోయిన సంవత్సరం లాక్ డౌన్ కారణంగా అవి మరింత పెరిగాయి. ప్రభుత్వం ఎన్నో చట్టాలను తీసుకొచ్చింది. ప్రతీ సమస్యకు ఒక పరిష్కారాన్ని కూడా మన ముందు పెట్టింది. కానీ వాటిని అమలు పరచడంలో ప్రతీ సారి పడిపోతూనే ఉంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ఐదవ లక్ష్యం (SDG-5) 2030 లోపు లింగ సమానత్వాన్ని సాధించాలని లక్ష్యంగా ముందుకు వెళ్తుంది. భేటీ బచావో భేటీ పడావో, ఉజ్జ్వల, మహిళా శక్తి కేంద్రాలు, నిర్భయ చట్టం, దిశ ఆక్ట్, మొదలైన వాటిని ప్రభుత్వం ముందుకు తెచ్చింది. చట్టాలను తయారు చేసి, పాలసీలను ప్రతిపాదించి దేశంలో ప్రకటిస్తే సరిపోలేదు. వాటి అమలు అన్నిటికంటే ముఖ్యం. విద్యా వైద్యం మీద పెట్టుబడులు పెరగాలి. మహిళలకు సంబంచిన అవసరాలకు కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పరచాలి, వారికి కావాల్సిన భద్రతా మరియు రక్షణా విషయాలపై దృష్టి సారించాలి. వ్యాపార రంగాల్లో మహిళా వ్యవస్థాపకులు ముందుకు వచ్చేలా చేయాలి. గ్రామాల్లో మహిళా సంఘాలు , గ్రామీణ బ్యాంకులు వాటికి దోహద పడాలి. పని ప్రదేశాల్లో రక్షణ అమలు పర్చి, ఖచ్చిత ఆదాయం లేకపోయినా ఇల్లాలు శ్రమను గుర్తిచాలి. ఇంకా విడ్డూరంగా ఆడదానికి ఆడదే శత్రువని చాలా చోట్ల నిరూపించబడుతుంది. ప్రతీ అత్త , కోడలిని కూతురిలా చూడాలి అన్న మాట బాగా అనిపించినా అది జరగని పనే. కాబట్టి ఖనీసం కోడలిగా చూడటం నేర్చుకున్నా కుటుంబ వ్యవస్థలు బాగుంటాయి. సమతుల్యం లేకపోతే పర్యావరణమైనా , ప్రపంచంలో ఏ వ్యవస్తైనా ప్రాణం లేనిదిగా మారాల్సిందే. అలాంటిది సృష్టి జీవనానికి కారణమైన ఆలు మగల జనాభా సమతుల్యంగా లేకపోతే నేడుకి రేపు కరువే. అమ్మగా తన పిల్లల్ని నడిపించి సరైన బాటను వేసిన తాను ,సమాజాన్ని నడపడానికి ఇంకెంత జాగ్రత్త పడుతుంది!. ఆడవారిని నడిపించడం, వారితో కలిసి పని చేయడం చిన్నచూపు , చేతకాని తనం కావు. అదే పరిపక్వత కలిగిన సమాజ లక్షణం అన్న అలోచన మగవారిలో రావాలి. మహిళా సాధికారిత అన్న మాట ప్రతీ మీటింగులో బల్ల గుద్ది చెప్పేస్తారు. నిజమైన సాధికారిత కల్పించడానికి మాత్రం ముందుకు వచ్చేవారు తక్కువ. సముద్రాల మీద వర్షం పడితే లాభం లేదు, అలాగే చేయూత ఇవ్వాల్సిన చోట ఇవ్వకుండా మాటలు మత్రమే కోటలు కడితే సరిపోదు. అమ్మాయి జీవితం చాలా దుర్భలమైనది. ఏ తప్పు జరిగినా ఆడవారిపై వేలెత్తి చూపడం చూసస్తానే ఉన్నాం. అన్ని సమస్యలకు కేంద్రంగా నిలబెడతాం. అన్నీ తట్టుకుని నిలబడాలని ఒక్క అడుగు ముందుకు వేస్తుంది. ఆ అడుగుకు సాయం రాకపోయినా పర్వా లేదు, కనీసం అడ్డు రాకుండా ఉంటే సరిపోతుంది. తనకు తాను నిలబడగలదు. అదే అడుగుకు ఒక్క చెయ్యి సాయం అందించినా ఆమె చెయ్యి ఈ అవనిని పాలిస్తుంది. ఒకే రెక్కతో పక్షి విహంగంలో విహరించడం అసాధ్యం. అమ్మాయి కూడా అభివృద్ధి చెందితేనే ఆ దేశం ఖ్యాతి విహంగ వీధుల్లో వర్ధిల్లుతుంది

# స్త్రీవాద ఉద్యమాలు - భారత మహిళల పాత్ర



నేటి భారతీయ మహిళ విద్య, రాజకీయాలు, మీడియా, కళలు, సంస్కృతీ, సేవా విభాగాలు, విజ్ఞాన, సాంకేతిక రంగాలు వంటి అన్ని రంగాలలో పాల్గొంటోంది. పదిహేనేళ్ళపాటుభారతదేశపు ప్రధానమంత్రిగాఉన్నఇందిరా గాంధీప్రపంచంలో ప్రధానమంత్రిగా ఎక్కువకాలం పని చేసిన మహిళ. స్త్రీ శక్తిని తక్కువగా అంచనా వేసే ఆ రోజుల్లో ఒక మహిళ ప్రధానమంత్రిగా అంత పెద్ద దేశాన్ని, అంత మంది ప్రజలను, తనకున్న తక్కువ అనుభవంతో ఎలా పరిపాలిస్తుందో ప్రపంచం మొత్తం గమనిస్తోంది. వారందరి అంచనాలను తలక్రిందులు చేస్తూ ఆమె కొద్ది కాలంలోనే తన సమర్థతను నిరూపించుకుంది. బ్యాంకులు జాతీయం చేయడం, ప్రభుత్వ రంగ సంస్థలను నెలకొల్పడం, గరీబీ హటావో, పేదరిక నిర్మూలన వంటి కార్యక్రమాలతోప్రజల మన్ననలు పొందారు. భారతదేశపు రాజ్యాంగం భారతీయ మహిళలందరికీ సమానత్వం (ఆర్టికల్ 14), రాష్ట్రాన్ని బట్టి ఎటువంటి వివక్షా చూపించకుండా ఉండడం, అవకాశంలో సమానత్వం, సమాన పనికి సమాన జీతం మొదలైన హామీల నిస్తున్నది. రాష్ట్రాలు స్త్రీలకు, పిల్లలకు ప్రత్యేక సదుపాయాలను అందించే వీలు కలుగజేస్తుంది. మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను త్యజించాలనిసూచిస్తోంది. అలాగే స్త్రీలకు ప్రసూతి సెలవలు ఇవ్వడానికి, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించడాన్ని అనుమతిస్తుంది. 1970 చివరిలో భారతదేశంలో స్త్రీవాద ఉద్యమం ఊపందుకుంది. మహిళా సంఘాలను దగ్గరికి చేర్చిన జాతీయ స్థాయి సమస్యలలో మొదటిది, మథుర రేప్ కేసు. మథుర అనే అమ్మాయిని పోలిసు స్టేషన్లో రేప్ చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులను విడుదల చేయడం 1979-1980లో విస్తృతంగా నిరసనలను ఎదుర్కొంది. జాతీయ మీడియా ద్వారా నిరసనలకు విస్తృత ప్రాచుర్యం లభించింది. ఇవి ఎవిడెన్స్ చట్టం, క్రిమినల్ ప్రొసిజర్ కోడ్, ఇండియన్ పీనల్ కోడ్ లలో కస్టోడియల్ రేప్ అనే అంశాన్ని చేర్చాల్సిన ఆవశ్యకతను ప్రభుత్వాలకు కలిగించాయి. ఆడ శిశు భ్రూణ హత్యలు, లింగ వివక్ష, మహిళా ఆరోగ్యం, స్త్రీ అక్షరాస్యత వంటి అంశాల మీద మహిళా ఉద్యమకారులు ఏకమయ్యారు. ఆల్కహాలిజం తరచుగా భారతదేశంలో మహిళల మీద హింసతో ముడిపడి ఉండటంతోఅనేక మహిళా సంఘాలు మద్యపాన నిషేధ ప్రచారాన్ని ప్రారంభించాయి. నెల్లూరు జిల్లాలో మొదలైన మద్యపాన వ్యతిరేక ఉద్యమం ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మార్పిడి అలాగే మిగతా రాష్ట్రాలలోకొంత మార్పు వచ్చింది. చాలామంది ముస్లిం మహిళలు షరియత్ చట్టం క్రింద స్త్రీల హక్కుల గురించి మూల సిద్ధాంత నాయకుల అభిప్రాయాన్ని ప్రశ్నించి మూడుసార్లు తలాక్ చెప్పే పద్ధతిని విమర్శించారు. 1990లో విదేశీ దాతల ఏజన్సీల ద్వారా నిధులతో క్రొత్త మహిళా-సంబంధిత ఎన్జీఓ లు ఏర్పడ్డాయి. సెల్ఫ్-ఎంప్లాయ్డ్ వుమెన్స్ అసోసియేషన్ వంటి స్వీయ-సహాయ గ్రూపులు, ఎన్జీవోలు భారతదేశంలో మహిళల హక్కులలో ప్రధానపాత్ర పోషించాయి. చాలామంది మహిళలు స్థానిక ఉద్యమాలలో నాయకురాళ్ళుగా అవతరించారు. ఉదాహరణకు నర్మదా బచావో ఆందోళనకి సంబంధించిమేధా పాట్కర్‌గారు. భారత ప్రభుత్వం 2001 సంవత్సరాన్ని మహిళా సాధికార సంవత్సరం -స్వశక్తిగా ప్రకటించింది. మహిళా అధికార జాతీయ విధానం 2001లో అమల్లోకి వచ్చింది. 2006లో ఇమ్రానా అనే ముస్లిం రేప్ బాధితురాలు మీడియాలో ఎక్కువ ప్రచారం పొందింది. ఇమ్రానా తన మామ చేతిలో అత్యాచారానికి గురయ్యింది. కొంతమంది ముస్లిం పెద్దలు ఇమ్రానా తన మామని పెళ్ళి చేసుకోవాలని తీర్పు ఇవ్వడం తీవ్ర నిరసనలకు దారితీసింది. చివరికి ఇమ్రానా మామకి 10 సంవత్సరాల జైలు శిక్ష పడింది. ఈ తీర్పును అనేక మహిళా సంఘాలు, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డూ స్వాగతించాయి. 2010 మార్చి 9న అంతర్జాతీయ మహిళా దినోత్సవం తరువాతి రోజు రాజ్యసభ మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించింది, ఇది పార్లమెంటులోను, రాష్ట్ర శాసనసభల్లోనూ మహిళలకు 33% రిజర్వేషన్ను అందిస్తుంది

డా. యం. అఖిల మిత్ర, గౌతమ్ బుద్ధ అభివృద్ధి సమాఖ్య

# రోడ్డు ప్రమాదం తీవ్రత ఎక్కువగా మహిళ పై పడుతుంది

## ఆర్. కె. దుర్గ పద్మజ రాష్ట్ర అధ్యక్షులు రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ.




నరసరావుపేట, ప్రజాపాలన :అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల చే నిర్వహింపబడే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల అభిప్రాయ సేకరణ లో భాగంగా నరసరావుపేట పార్లమెంట్ కేద్రం లోని రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ, నీతీ ఆయోగ్ లో నమోదు కాబడిన సంస్థ ప్రతినిధి ఆర్. కె. దుర్గ పద్మజ తాను నిర్వహించే సంస్థ విషయాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయినసందర్భంగా, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం చేసే యన్. జి. ఓ సంస్థలు హైదరాబాద్ కె పరిమితమైన తరుణంలో, మేము చీఫ్ ఇంజినీర్ స్థాయి అధికారిని కలిసి మా అభిప్రాయాన్ని తెలుపగా వారు రోడ్డు ప్రమాదంలో గాయపడి కాళు ్ళ చేతులు పోగొట్టుకున్న వారికి సహాయం అందించే సంస్థలు పుష్కలంగా ఉన్నాయి అని, ఐతే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు ప్రమాదాల నివారణకె మొదటి ప్రాధాన్యత నిస్తుంది అని, దీనిపై ప్రజల్లో చైతన్యం కలిపించటానికి ఒక మహిళ గా నువ్వు ముందుకు రావడం చాలా గొప్ప విషయం అంటూ మా రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ 2014 స్థాపించిననాటి నుండి ఇప్పటివరకు మాకు ఎంతో సహాయం చేసిన చీఫ్ ఇంజినీర్ గారికి ముందుగా నా ధన్యవాదాలు. మరి రోడ్డు ప్రమాదాల అంశాన్ని తీసుకుంటే మా యన్. జి. ఓ రాష్ట్ర వ్యాప్తంగా పదమూడు జిల్లాలోని రీజినల్ కమిటీల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిపిస్తున్నాం అని ముఖ్యంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలో ముఖ్యంగా విజయనగరం జిల్లాలో మజ్జి అప్పారావు గారి నేతృత్వంలో గుడ్ సమారిటైన్ పై ప్రజల్లో అవగాహన కలిపించాము అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి ఆదేశాలు మేరకే వివిధ రంగాల్లో పనిచేసే మహిళా సంస్థల ప్రతినిధులు సేవలు గుర్తింపు చెయాలి అని పేర్కొన్నతరుణంలో ఒక మహిళ గా రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ ద్వారా చేస్తున్న కార్యక్రమాలు గుర్తించిరాష్ట్ర రవాణా శాఖ మంత్రి పేర్ని వెంకటరామయ్య ప్రశంసా పత్రాన్ని అందజేసారు. మా యొక్క యన్. జి. ఓ ప్రధాన ఉద్దేశ్యం కేంద్ర ప్రభుత్వం మినిస్టరీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్పోర్ట్ మరియూ హైవే వారి రోడ్డు భద్రతా అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రోడ్డు ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవడం. ఒక్క సంవత్సర కాలం లో ఒక లక్షా యాభై వేలమంది రోడ్డు ప్రమాదంలో మరణిస్తున్న తరుణంలో, దీనిపై రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ మరియూ రీసెర్చ్ ద్వారా అధ్యయనం చేయగా నూటికి ఎనభై శాతం డ్రైవర్ల యొక్క తప్పిదం వల్లనే రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న రు అని తేలింది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజల్లో రోడ్డు భద్రతా అవగాహన కోసం యన్. జి. ఓ సంస్థలను భాగస్వామ్యం చేసి ప్రచారం చేయాలి అని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మధ్య కాలంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి చైర్మన్ గా ఉండే రాష్ట్ర రహదారి భద్రతా కౌన్సిల్ సమావేశం కూడా నిర్వహించిన అంశం తెలిసిందే. మరి ప్రతి ఒక్క జిల్లాలో పార్లమెంట్ సభ్యుడు చైర్మన్ గా ఉండే జిల్లా రహదారి భద్రతా కమీటీ కూడా ఏర్పాటు చేసుకోవడం జరిగింది. రవాణా శాఖ అధికారులు లైసెన్స్ లు మంజూరు సమయంలో లైట్ మోటారు వాహనాల కు సంబంధించిన శిక్షణ పొందినట్లు మోటారు వాహనాల చట్టము ఫారం ఐదు తప్పనిసరిగా పరిశీలించాలి అని మా రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ తరుపున సూచించటం జరిగింది అని పద్మజ పేర్కొన్నారు. ఈరోజుల్లో కుటుంబానికి వ్యక్తి ప్రాణం ముఖ్యం అని, కుటుంబ యజమాని రోడ్డు ప్రమాదంలో మరణించిన తర్వాత ఆ ప్రభావం ఒక భార్యగా తల్లిగా చెల్లిగా కూతురుగా మహిళా పైనే పడుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో యన్. జి. ఓ లను ప్రోత్సాహం ఇచ్చి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి విజ్ఞప్తి అని పేర్కొన్నారు.

## మునిసిపల్ సిబ్బందిఅంకిత భావంతో పనిచేయాలి



నరసాపురం, మార్చి 7 (ప్రజాపాలన ప్రతినిధి) : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఇంజనీరింగ్ ,ఇండోర్ ,ఔట్ డోర్ సిబ్బందితో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీ వెంకటరమణ జయరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ వీధి దీపాలు, మంచినీటి సమస్య, పారిశుద్ధ్యం, గృహ నిర్మాణం మరియు ఇంజనీరింగ్ పనులను వేగవంతం చేయాలని ప్రజల సమస్యల పరిష్కారానికి సిబ్బంది, అధికారులకు అందుబాటులో ఉండాలని చైర్ పర్సన్ ఆదేశించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు బర్రి జయరాజు, బుల్లి మస్తాన్, కావలి రామసీత నాని, కామన బాలసత్యనారాయణ, భూసారపు జయప్రకాష్, గొల్ల జయరాజు, జిల్లెల్ల దిలీప్ కుమార్, మునిసిపల్ కమిషనర్ సిహెచ్..శ్రీనివాస్ ,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ కుమార్, ఏఈలు మణి, సునీల్, రవితేజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ సెల్లార్ నిర్మాణంపై స్పందనలో కలెక్టర్కు ఫిర్యాదు..



వినుకొండ (ప్రజాపాలన ప్రతినిధి): పట్టణంలో అనుమతులు లేకుండా అక్రమంగా సెల్లార్ నిర్మాణాలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని వినుకొండ పట్టణంలోని రెడ్డి నగర్ 7వ లైన్కు చెందిన వైసీపీ నాయకుడు శివారెడ్డి సోమవారం స్పందనలో కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. వినుకొండ పట్టణంలో అనధికారికంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి ఇద్దరూ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా అక్రమార్కులకు సహకరిస్తూ ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వినుకొండ పట్టణానికి సెల్లార్ అనుమతులు లేవని, పట్టణంలోని వెంకటరమణ టైప్ ఇన్స్టిట్యూట్ ఎదురుగా గ్రామ కంఠం సర్వేనెంబర్ 367 లో గత వారం రోజులుగా అక్రమంగా సెల్లార్ నిర్మాణం చేపడుతున్నారని ఒక దినపత్రికలో అక్రమ నిర్మాణాలపై వార్త ప్రచురితమైన మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడి అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా జాయింట్ కలెక్టర్ అనధికారిక నిర్మాణాలు వెంటనే నిలిపివేయాలని వినుకొండ మున్సిపల్ కమిషనర్కు ఆదేశించారు.

## వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో బ్రాహ్మణులకు తీరని అన్యాయం...



విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి :గొల్లపూడి లోని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఇతర ప్రభుత్వ భవనాలకు తరలిస్తే ఉద్యమిస్తాం... రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన మచిలీపట్నం పార్లమెంట్ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ కృష్ణాజిల్లా మాజీ ఆర్గనైజర్, పి.వి. ఫణి కుమార్..సోమవారం, బ్రాహ్మణుల సమస్యలు, గొల్లపూడి లోని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ కార్యాలయ భవనాన్ని ఇతర ప్రభుత్వ కార్యాలయలకు తరలించవద్దని కలెక్టరేట్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎల్. శివశంకర్ గారికి పి.వి. ఫణి కుమార్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి, గొల్లపూడి లోని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ భవనంలో ఏ ఇతర ప్రభుత్వ కార్యాలయాన్ని ఏర్పాటు చేయవద్దు అంటు ప్ల కార్డులతో నిరసన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన నాయకులు వేమూరి రామకృష్ణారావు, మోపర్తి సుబ్రహ్మణ్యం, నందూరి సదాశివరావు, కానుకొలను ఫణికిరణ్ , బృందావనం శ్యాంకుమార్ , పి పాండురంగ చడగ , దూళిపాళ్ల శ్రీరామచంద్ర మూర్తి, నాగలింగం అయోధ్య రామచంద్రరరావు , అంబటిపూడి సుబ్రహ్మణ్యం , విశ్వనాధ శర్మ , మహిళా నాయకురాళ్లు సర్వా లలితా కుమారి, అంబటిపూడి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కామినేనిలో విజయవంతంగా కిడ్నీ మార్పిడి



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : అత్యాధునిక వైద్య సేవలను అందించడంలో అగ్రగామిగా ఉన్న తాడిగడపలోని కామినేని హాస్పిటల్స్ నందు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేసినట్లు హాస్పిటల్స్ సీవోవో డాక్టర్ నవీన్ కుమార్ వెనిగళ్ల తెలిపారు. టిక్కిల్ రోడ్డులోని మనార్ ఫుడ్ ప్లాజాలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కామినేని అడ్వాన్స్డ్ నెఫ్రాలజీ విభాగంలో కిడ్నీ మార్పిడి చికిత్సను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. కానూరుకు చెందిన పొర్ల రామకృష్ణ (42) మూత్రపిండాలు పూర్తిగా దెబ్బతినడంతో తమ ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. పేషేంట్ ఆరోగ్య పరిస్థితిని విశ్లేషించిన అనంతరం కిడ్నీ మార్పిడి అవసరమని నిర్ధారించామని అన్నారు. రామకృష్ణ తల్లి తన కిడ్నీని ఇచ్చేందుకు ముందుకురావడంతో ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ సరిత, యూరాలజిస్టులు డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ మూర్తి నేతృత్వంలో రీనల్ ట్రాన్స్ప్లాంటేషన్ చికిత్సను నిర్వహించినట్లు తెలిపారు. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స అనంతరం పేషేంట్ ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్ నవీన్ వెల్లడించారు. ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ సరిత మాట్లాడుతూ ఈ కిడ్నీ మార్పిడి చికిత్సను అత్యంత తక్కువ వ్యయంతో నిర్వహించామని చెప్పారు. ఈనెల 10వ తేదీన వరల్డ్ కిడ్నీ డే జరుపుకుంటున్నామని అన్నారు. బీమూత్రపిండాల ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో కామినేని హాస్పిటల్స్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకి స్పందన



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి:నగర పాలక సంస్థ పరిధిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదకి స్పందన కార్యక్రమంలో సోమవారం సుమారు 12 అర్జీలను నగర పాలక సంస్థ కమీషనరు ఎం అభిషిక్త్ కిశోర్ స్వీకరించారు. అదేవిధంగా డయల్ యువర్ కమీషనరు వారి కార్యక్రమంలో 9 ఫోన్ కాల్స్ రావడం జరిగిందని వాటికి సమాదానాలు తెలపడం జరిగిందని కమిషనర్ వెల్లడించారు. పేస్ బుక్ కామెంట్సు 11 వరకు వచ్చాయనివాటికి కూడా వివరణలు ఇవ్వడం జరగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనరు పి.ఎం సత్యవేణి సిటీ ప్లానరు సూరజ్ కుమార్, ఎస్ ఇ శేషగిరిరావు, ఎం. హెచ్.ఓ ఎ. వినూత్న మేనేజరు శ్రీనివాసరావు వివిధ విబాగాలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ సాంప్రదాయ వంటకాల పోటీలు



అనకాపల్లి : ప్రజాపాలన ప్రతినిధి:స్థానిక అనకాపల్లి పట్టణం తుమ్మపాల గ్రామంలో గల శాఖ గ్రంథాలయంలో బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు మ్యూజికల్ చైర్ లెమన్ స్పూన్ సాంప్రదాయ వంటకాల పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చినటువంటి బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి తాతపూడి జయశ్రీ మాట్లాడుతూ మహిళలు గృహిణిలుగా ఉద్యోగస్తులుగా సమాజంలో ఎంతో కష్టపడుతున్నారని వారికి కాస్త ఆటవిడుపుగా ఉంటుందనే ఉద్దేశ్యంతో మేము ఈ పోటీలను నిర్వహిస్తున్నామని మహిళలంతా ఎంతో ఆసక్తిగా ఈ పోటీలలో పాల్గొనడమే కాకుండా కోలాటాలు సాంప్రదాయ నృత్యాలతో ఎంతో చురుకుగా పాల్గొన్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యూజికల్ చైర్స్ విభాగంలో మొదటి బహుమతి ఏ.సుష్మిత ద్వితీయ బి. రామలక్ష్మి బహుమతి తృతీయ స్.లక్ష్మీ బహుమతులను గెలుచుకున్నారు. అదేవిధంగా లెమన్ స్పూన్ విభాగంలో మొదటి బహుమతి ఉమ మహేశ్వరి, ద్వితీయ బహుమతి మౌనిషా, తృతీయ బహుమతి రేవతి గెలుచుకున్నారు అని మరియు సాంప్రదాయ వంటకాలు పోటీలలో మొదటి బహుమతి పి.కామేశ్వరి ద్వితీయ బహుమతి బి.సంధ్య తృతీయ బహుమతి ఎం.లోకేశ్వరి గెలుచుకున్నారు. ఈ పోటీలలో పాల్గొని గెలుపొందిన టువంటి మహిళలకు ఈ నెల 8వ తేదీన నిర్వహించబడే అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులను అందిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి తాతపూడి జయశ్రీ సంస్థ ప్రతినిధులు పి.వి కిరణ్మై ది ఆనంద గీతిక స్థానిక ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## జర్నలిస్టులకు 10 వేల గౌరవ వేతనం ఇవ్వాలి



నరసాపురం, మార్చి 7 (ప్రజాపాలన ప్రతినిధి) :చిన్నపత్రికల సంపాదకులకు నెలకు రూ 10 వేలు గౌరవ వేతనం ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ నర్సాపురం సబ్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ కు ఏపీఈఆర్యూ సంఘం తరుపున బొడ్డు కృష్ణ భగవాన్ వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని జిల్లాల్లో కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీవోలకు పత్రికా సంపాదకుల సమస్యల పరిష్కారం కోరుతూ స్పందన కార్యక్రమంలో భాగంగా వినతి పత్రాలు అందజేశామని కృష్ణ భగవాన్ తెలిపారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వై యస్. జగన్మోహన్ రెడ్డికి ప్రతి ప్రాంతంలో ప్రత్యేక సంచికలు వేసి స్వాగతం పలికామని, ఆ సమయంలో చిన్న పత్రికల యాజమాన్యాలకు జగన్మోహన్ రెడ్డి అండగా ఉంటామని చెప్పారని అన్నారు. రాష్ట్రంలో మతపరమైన పూజారులు, పాస్టర్లకు, ఇమామ్, మౌజన్లకు ఇస్తున్నట్లే వార, మాస, పక్ష పత్రికల సంపాదకులకు నెలకు రూ 10 వేల గౌరవం వేతనం ఇచ్చేలా అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. జిఎస్టీ భారం లేకుండా చిన్న, పిరియాడికల్ పత్రికల సంపాదకులు, విలేఖరులకు అక్రిడేషన్ ను ఈ ఏడాది మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు. ప్రతి జర్నలిస్తుకు స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలని, రాష్ట్రంలోని ప్రతి కార్పొరేట్ హాస్పిటల్లో జర్నలిస్టులకు ఉచిత వైద్యం అందించాలని, 50 సంవత్సరాలు దాటిన ప్రతి జర్నలిస్టుకు రూ 10 వేలు తక్కకుండా పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ సబ్ కలెక్టర్ విష్ణుచరణ్ కు వినతిపత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పత్రికా ఎడిటర్లు గుబ్బల చెన్నకేశవరావు, దుర్గేష్, తిరుమాని శ్రీనివాస్, యం విజయకుమార్, కె సత్యనారాయణ, వి.పవన్ కుమార్, ఎన్ రాంబాబు తదితరులు ఉన్నారు.

## హెల్త్ సెంటర్ హాస్పటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం



రాజమహేంద్రవరం రూరల్: ప్రజాపాలన ప్రతినిధి: ఈ కార్యక్రమం హాస్పిటల్ ఇంచార్జి సుపెరిటెండెంట్ డా" బి. మహేంద్ర ఆధ్వర్యంలో కడియం గ్రామంలో గల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ యొక్క హాస్పటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులగా దొడ్డ బుజ్జి, నరమామిడి గణేశ్వర రావు ప్రమాణస్వీకారం చేశారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక కడియం ఆసుపత్రి ప్రాంగణంలో సోమవారం నాడు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా రాజమండ్రి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ హాజరయ్యారు. చందన నాగేశ్వర్ డాక్టర్లు తమ హాస్పిటల్ లో ఉన్న సమస్యలను వివరించారు. వైద్యాధికారులు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో రాజీ లేకుండా తన కర్తవ్య నిర్వహణ కొనసాగించాలని సూచించి, ఆస్పత్రుల్లో నెలకొన్న వివిధ సమస్యలు, అవసరమైన మౌలిక వసతులు కల్పనకు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలియజేసారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దొడ్డ బుజ్జి, నరమామిడి గణేశ్వరరావు లను హాస్పిటల్ అభివృద్ధి విషయంలో రాజి పడకుండా హాస్పిటల్ కి చికిత్స గురించి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి డాక్టర్లు ఇతర వైద్య సిబ్బందితో కలిసి రోగులకు మరియు ఆసుపత్రి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తారని, ప్రజా ఆరోగ్య దృష్ట్యా ఐక్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఇంచార్జి సుపెరిటెండెంట్ డా. బి. మహేంద్ర, డా.మోహన్ వంశీ,డా శివ శంకర్ మరియు వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాలవీర్రాజు( బాబు), కడియం మండల అధ్యక్షులు స్టాలిన్, డీల్డిఓ%ఉ%ఎంపీడీఓ రత్న కుమారి, ఉప్పులూరి హనుమంతరావు, సూరపురెడ్డి చిన్న వీరాస్వామి, కడియపులంక సొసైటీ ఛైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, ఎంపీటీసీలు ఆకుల సుధాకర్,సాపిరెడ్డి కామేష్, పసల నాయుడు,కొత్తూరి బాల నాగేశ్వరరావు,రావిపాటి సత్యనారాయణ మూర్తి,మర్రి చంద్రరావు, రంపంగోపాలకృష్ణ, తాడాల నాని, చింతపర్తి రాంబాబు, ఎల్లే వీర్రాజు, వరసాల గనియ్య, కడియం గణేష్, మహిచర్ల శ్రీనివాస్ దాసరి నాగేంద్ర,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు పునర్జీవం వచ్చింది: మంత్రి పేర్ని నాని



మచిలీపట్నం ప్రజాపాలన ప్రతినిధి మార్చి 7: ప్రభుత్వ పాఠశాలలకు పునర్జీవం వచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు పరుగులు పెడుతున్నారని అన్ని సౌకర్యాలూ ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని రాష్ట్ర రవాణా, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి పేర్ని వెంకట్రామయ్య ( నాని ) పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆయన శాసనసభ బడ్జెట్ సమావేశాలకు హాజరవుతూ సైతం తన కార్యాలయం వద్దకు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను కలుసుకొని వారి ఇబ్బందులను అడిగి తెలుసుకొని అనేక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.

## నిర్దేశిత గడువులోగా ఫిర్యాదుదారులకు తగు పరిష్కార మార్గం చూపాలి : ఎస్పీ శ్రీ ఐశ్వర్య రస్తోగి



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి: అర్బన్ జిల్లా ఎస్పీ శ్రీ ఐశ్వర్య రస్తోగి, మరియు అడిషనల్ ఎస్పీ కె.లతామాధురి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం నందు సామాన్య ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 19 మంది ఫిర్యాదుదారుల అర్జీలను స్వయంగా స్వీకరించి, వారి సమస్యల పూర్వాపరాలను అడిగి తెలుసుకుని వారికి రసీదులను అందించారు, వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి నిబంధనల, చట్ట ప్రకారం విచారణ జరిపించి ఫిర్యాదుదారుల సమస్యలు జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా ఫిర్యాదుదారులకు తగు పరిష్కార మార్గం చూపాలని సూచించడం జరిగింది.

## స్పందన కార్యక్రమానికి 12 అర్జీలు: తాసిల్దార్ రత్నం



పొన్నూరు మార్చి07( ప్రజా పాలన ప్రతినిధి) :సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 12 అర్జీలు వచ్చినట్లు మండల తాసిల్దార్ రత్నం తెలిపారు. ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు, పట్టాదారు పాసుపుస్తకం కొరకు ప్రజలు అర్జీలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని ఆయన అర్జీదారులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమం ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తూర్పు లంక భూములు దళితులకు అప్పగించాలి



రాజమహేంద్రవరం : ప్రజాపాలన ప్రతినిధి:దళితులకు కేటాయించిన భూములను కబ్జాదారులు నుంచి స్వాధీనం చేసుకుని తిరిగి దళితులకి అప్పగించాలని గుర్రం జాషువా ఎస్సీ ఫీల్డ్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు జే.బీ. గిరిధర్, వైస్ ప్రెసిడెంట్ మర్రి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం వెంకట నగరం , తూర్పు లంక భూములను దళితులకు అప్పగించాలని కోరుతూ జే.బీ.గిరిధర్, మర్రి. పుష్పరాజ్ ఆద్వర్యంలో కోటిలింగాల పేట కు చెందిన గుర్రం జాషువా ఎస్సీ ఫీల్డ్ లేబర్ కో -ఆపరేటీవ్ సొసైటీ సభ్యులతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటిలింగాల పేట కు చెందిన దళితులకు 1930వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం 250 ఎకరాల తూర్పు లంక భూములను ఆది ఆంధ్ర ఫీల్డ్ సొసైటీలోని పేదలకు కేటాయించినఇచ్చిందని తెలిపారు. ఈ భూములలో కొన్ని ఆక్రమణలకు గురయ్యాయని, మిగిలిన ఎనభై ఆరు ఎకరాల భూమిని గత 30 సంవత్సరాలుగా ఐదుగురు వ్యక్తులు నకిలీ రికార్డులు సృష్టించి, సొసైటీ కొనసాగుతుందని ప్రభుత్వాన్ని మోసం చేస్తూ ఆ భూములలో సాగు చేసుకుని భూములలో పండించిన పంటను పేపర్ మిల్ వారికి విక్రయిస్తూ లబ్ధి పొందుతున్నారని తెలిపారు. పేదలకు చెందిన వెంకట నగరం తూర్పు లంక భూములను కోటిలింగాల పేట లోని 300 కుటుంబాలకు పంపిణీ చేయాలని, ప్రస్తుతం భూమిని అనుభవిస్తున్న ఐదుగురు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకొని రెవెన్యూ ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో దర్యాప్తు చేసి తూర్పు లంక భూములపై నకిలీ రికార్డులు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోటిలింగాల పేట కు చెందిన గుర్రం జాషువా ఎస్సీ ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ నాయకులు కృష్ణవేణి, అనసూయ, సూర్యనారాయణ, ఎం. కన్న తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ సాక్షిగా ప్రజలను మోసం చేయడం తగదు

### ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్



విజయవాడ : పరిపాలన చేతకాని జగన్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్పించడం తగదని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్ విమర్శించారు. సంక్షేమ పధకాల అమలు పేరుతో అప్పులు చేసి మరీ ఖజానా ఖాళీ అయినా గొప్పలు చెప్పడం తగదని ఆరోపించారు. గవర్నర్‌కు తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేసిందని, కనీసం దీనిపై గవర్నర్ స్పందించలేదని అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం విజయవాడ ఆంధ్ర రత్న భవన్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రభుత్వం పని చేస్తున్నా దానిపై కూడా గవర్నర్ ఏనాడూ సీఎంను పిలిచి మాట్లాడలేదని, మూడు రాజధానుల బిల్లులో గవర్నర్ కూడా తప్పు చేశారని విమర్శించారు. ఈ బిల్లులు సరికాదని కోర్టులు కూడా చెప్పాయన్నారు. ఎన్నికల సంఘంపై దాడి జరిగినా గవర్నర్ స్పందించలేదని, ఈసీని ఎవరికీ తెలియకుండా తొలగించారన్నారు. సీఆర్డీఏ చట్టాన్ని రాత్రికి రాత్రే రద్దు చేశారని మండిపడ్డారు. అందరూ ఒప్పుకున్న చట్టాన్ని ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. దీనిపై గవర్నర్ ప్రశ్నించకుండా సంతకం చేశారని శైలజనాథ్ విమర్శించారు.

## జిల్లాకేంద్రం కోరుతూ భారీ మోటార్ సైకిల్ ర్యాలీ



మొగల్తూరు, మార్చి 7 (ప్రజాపాలన ప్రతినిధి) : నరసాపురంను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా సోమవారం నియోజకవర్గంలోని మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలోని శ్రీ బండి ముత్యాలమ్మ ఆలయం వద్ద నుండి మొగల్తూరు సెంటర్ వరకు నరసాపురంను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని నిరసన తెలుపుతూ అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ నేతలు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ శాసనసభ్యులు బండారు మాధవ నాయుడు, నియోజకవర్గ తెదేపా ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు, నెక్కంటి సుబ్బారావు తదితరుల నేతృత్వంలో నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు ఆధ్వర్యంలో భారీ మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొగల్తూరు సెంటర్లో భారీ బహిరంగ సభ నిర్వహించారు.

## గాదెవారిపల్లి పి హెచ్ ఎస్ సి ని సందర్శించిన ఎంపీపీ ఎంపీడీవో



కారంపూడి..మార్చ్07...ప్రజాపాలన... ప్రతినిధి... మండలం లో నీ గాదేవారి పల్లె లోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం మండల పరిషత్ అధ్యక్షులు మేకల శారదా శ్రీనివాస్ రెడ్డి ఎంపీడిఒ బి బాలు నాయక్ సందర్శించారు. తొలత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని ప్రజలకు వైద్య సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. ఎంపీడీవో బి బాలు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిర్దిష్ట వయస్సు ను అనుసరించి కరోనా వ్యాక్సీన్ ను పొందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా తొలి డోస్ పూర్తి చేపించుకున్న వారు రెండవ డోస్ తో సంపూర్ణ లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. వేసవి కాలాని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఆరోగ్య విషయంలో తగు సూచనలు ఇవ్వాల్సిందిగా తెలిపారు. హాస్పటల్ లో ఉన్నటువంటి ప్రతి గదిని పరిశీలించారు. తదుపరి నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమం లో వైద్యాధికారి ఆర్ ఆంజనేయులు నాయక్, ఎంపీహెచ్ఇఓ కె శ్రీనివాస రెడ్డి, హె చ్ ఎస్ ఇ శ్రీనివాస రావు, ఎంపీటీసీ కె సైదా రెడ్డి,యూడీసీ రామ్మోహన్ రావు, స్టాఫ్ నర్స్ దేవి, ఫార్మాసిస్ట్ రజిని,నాయకులు కాశీ రెడ్డి, వెంకట రెడ్డి, బైరెడ్డి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బి.జె.పి- ఓ.బి.సి మోర్చా అధ్వర్యంలో బి.సి సంక్షేమ హాస్టల్‌లో వసతుల పరిశీలన



నరసరావుపేట.ప్రజాపాలన :భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు గారి ఆదేశానుసారం రాష్ట్రంలో గల బి.సి హాస్టల్స్ లో ఓ.బి.సి మోర్చా రాష్ట్ర , జిల్లా నాయకుల పరిశీలన చేసి అక్కడ విద్యార్ధులకు గల సమస్యలు తెలుకుని ,వారికి సక్రమంగా ఆహారం, నీరు , వైద్య ,విద్య ,వసతి సౌకర్యాలు, మరుదొడ్ల శుభ్రత , వరిసరాల పరిశుభ్రత , రాత్రావేళ్ళలో రక్షణ పడుకోవటానికి తగిన సౌకర్యాలు, సమయానికి టిఫిన్ , భోజన సదుపాయాలు అన్ని సక్రమంగా ఉన్నవా ? లేవా ? విద్యార్ధుల హాజరు సరిగా ఉన్నదా ?లేదా ? రాష్ట్ర ప్రభుత్వం నుండి బి.సి హాస్టల్స్ కు అందవలసిన అన్ని సౌకర్యాలు అందుతున్నవా ? లేదా అనే విషయాలు అన్ని పరిశీలన చేసి అక్కడ ఇంకా ఏ మైనా సమస్యలు ఉన్నచో వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియపరచాలని అదేవిధంగా ప్రతి బి. సి హాస్టల్ లోను భారతీయ జనతాపార్టీ సహాయార్ధం ఫోన్ నెంబరును విద్యార్ధులకు ఇచ్చి వారికి భరోసా కల్పించాలని ఆదేశించారు.దీనిలో భాగంగా ది: 07/03/2022 న పల్నాడు జిల్లా ( నర్సరావుపేట ) లో బి.జె.పి - ఓ.బి.సి మోర్చా జిల్లా అధ్యక్షుని సారధ్యంలో ఓ.బి.సి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిమూలం గురుస్వామి , ప్రతాపాచారి , శ్రురాం ప్రసాద్ , చెన్నా నాగేశ్వరావు తదితరులునర్సరావుపేటలో రెడ్డి నగర్ నందు పల్నాడు రోడ్ లో గల బి.సి హాస్టల్ ను సందర్శించి అక్కడ డిగ్రీ మరియు పి.జి చదువుతున్న విద్యార్ధులకు కలిసి వారికి అన్ని సదుపాయాలు ,సౌకర్యాలు సక్రమంగా ఉన్నవో ?లేవో విద్యార్ధులను అడిగి తెలసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగ అవకిశాల గురించి అడగగా రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉద్యోగ నియిమకాలు లేవని విద్యార్ధులు ఆవేదన వ్యక్తంచేయగా ,కేంధ్రప్రభుత్వ నోటిఫికేషన్లు ప్రతి వారం చాలా వస్తున్నవని సమయానుసారం వాటిని తెలుసుకుని అప్లై చేసుకోవాలని తెలిపారు.భారత ప్రధాని శ్రు నరేంద్ర మోదీగారు నిరుద్యోగులకు అనేక ప్రభుత్వ నియామకాలు చేపట్టె విధంగా చాలా కేంద్రప్రభుత్వ ఉద్యోగాలు ప్రతి వారం నోటిఫికేషన్లు వస్తున్నవని తెలిపారు .ఇంకా సందేహాలు , అవసరాలు ఏవైనా కావాలంటే భారతీయ జనతాపార్టీ నాయకులు మీకుతక్షణవే స్పందించి సహకరిస్తారని తెలిపారు. తరువాతనర్సరావుపేటలో స్థానిక స్టేషన్ రోడ్ నందుగల బి.సి బాలికల హాస్టల్ ను సందర్శించి అక్కడ ఉన్న విద్యార్థినీలను కలిసి వారితో మాట్లాడగా ...ఇక్కడ హైస్కూల్ విద్యార్థినీలు ఉండగా వారికి అన్ని సదుపాయాలు వార్డన్ కల్పిస్తున్నట్లు చెప్పారు.అనంతరం ఓ.బి.సి జిల్లా అధ్యక్షులు విద్యార్ధీనీలకు కేంధ్ర ప్రభుత్వం బి.సి విద్యార్ధీనీలకు కల్పించు సౌకర్యాలగురించి వివరాంచి రాష్ట్ర ప్రభుత్వం నుండి హాస్టల్ విద్యార్ధీనీలకు అన్ని సదుపాయాలు సక్రమంగా అందుతున్నవో లేవో అని అడిగి తెలుసుకున్నారు. సందేహాలు ఉంటె తన ఫోన్ నెంబరుకు ఫోన్ చేసి తెలియచెయాలని ఎప్పుడు సమస్యలు ఉన్నా భారతీయ జనతా పార్టీ నాయకులు మీకు తక్షణ సహాయ సహకారాలు అందిస్తారని భరోసా విద్యార్ధులకు కల్పించామని అన్నపురెడ్డి వెంకటేశ్వర్లు జిల్లా అధ్యక్షుడు బి .జె.పి- ఓ.బి.సి మోర్చా .నర్సరావుపేట. తెలిపారు.

## పార్స్, ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గం కార్పెంటర్స్ విభాగం అధ్యక్షులుగా టి.నరసింహ



మార్చి 07 ప్రజాపాలన ప్రతినిధి : పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి(పార్స్) ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గం కార్పెంటర్స్ విభాగం అధ్యక్షులుగా టి.నరసింహ నియమితులయ్యారు. ఈ మేరకు కడప పార్లమెంట్ అధ్యక్షులు శ్రీ జాకట విజయ్ శేఖర్, ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గం కార్పెంటర్స్ విభాగం అధ్యక్షులుగా టి.నరసింహను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యక్షులుగా టి.నరసింహ, రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్, అసెంబ్లీ, జిల్లా, మండలాల్లో నాయకత్వాన్ని తయారు చేయాలని తద్వారా బహుజన రాజ్యాధికార ఆవశ్యకతను గుర్తించే విధంగా కృషి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా టి.నరసింహకు సిడబ్ల్యూసి మెంబర్ మరియు ఆంధ్రప్రదేశ్ పార్స్ ఇంచార్జి గూడూరు సీతామహాలక్ష్మి అభినందనలు తెలియజేశారు.

## పార్స్ అమలాపురం పార్లమెంట్ కన్వీనర్ గా తోకల మురళి మోహన్



మార్చి 07 ప్రజాపాలన ప్రతినిధి : పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి(పార్స్) పార్స్ అమలాపురం పార్లమెంట్ కన్వీనర్ గా తోకల మురళి మోహన్నియమితులయ్యారు. సిడబ్ల్యూసి మెంబర్ మరియు ఆంధ్రప్రదేశ్ పార్స్ ఇంచార్జి గూడూరు సీతామహాలక్ష్మి, తోకల మురళి మోహన్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తోకల మురళి మోహన్, రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్, అసెంబ్లీ, జిల్లా, మండలాల్లో నాయకత్వాన్ని తయారు చేయాలని తద్వారా బహుజన రాజ్యాధికార ఆవశ్యకతను గుర్తించే విధంగా కృషి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తోకల మురళి మోహన్ ను నియామకం పట్ల పలువురు బహుజనులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా 3 కే రన్



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి: అర్బన్ పోలీసు జిల్లా ఎస్పీ శ్రీ ఐశ్వర్య రస్తోగి అధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని (త్రీ కె రన్) కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయం నందు జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం డి.పి.ఓ నుంచి ప్రారంభమై జె.యన్ రోడ్, ఎ.వి రోడ్, సి.ఆర్.పి.ఎఫ్ క్యాంప్ రోడ్, డి.పి.ఓ వద్ద ముగిసింది, 3 కి.మీ.మేర సాగిన ఈ కార్యక్రమంలో అర్బన్ జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు. ప్రతి విషయంలోనూ స్త్రీలలో సమాన హక్కులు (వృత్తిపరంగా, సామాజికంగా, సాంస్కృతికంగా), సమాన అవకాశాలు కోసం అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)శ్రీ సిహెచ్. పాపారావు , అడిషనల్ ఎస్పీ, ఈస్ట్ జోన్ శ్రీ కె.టి.వి.రవికుమార్, యస్.బి డిఎస్పీ శ్రీ డి.శ్రీనివాస్ రెడ్డి, జోనల్ డిఎస్పీలు శ్రీ జె.వి.సంతోష్, కుమారి యం.వి శ్రీలత, ఏ.ఆర్.డి.ఎస్.పి.సత్తిరాజు, ఆర్. ఐ. సంజీవ్ కుమార్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పథకాల్లో మహిళలకే అగ్రతాంబూలం: పెడన శాసనసభ్యులు జోగి రమేష్



పెడన, ,ప్రజాపాలన ప్రతినిధి :రాష్ట్రంలో ముఖ్యమంత్రి శ్రీ జగన్మోహన్ రెడ్డి గారి ప్రభుత్వం అమలు చేస్తున్న నిర్ణయాలతో మహిళా సాధికారతలో ఆంధ్రప్రదేశ్ నిశ్శబ్ద విప్లవంతో విజయం సాధించిందని పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ జోగి రమేష్ గారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగే మహిళ సదస్సుకు పెడన నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున మహిళా ప్రజాప్రతినిధులు, మహిళ నేతలు తరలివెళ్లనున్నారని తెలియజేశారు.మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తుండడం హర్షణీయమని,మహిళలు సొంతంగా తమ కాళ్ల మీద తామే నిలబడి ఎదిగేలా వైఎస్ జగన్ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు.ఇళ్లు లేని పేద కుటుంబాల్లో 30 లక్షల మంది మహిళలకు అక్కచెల్లెమ్మల పేరుతోనే ఇళ్ల పట్టాలిచ్చి సీఎం జగన్ ఆత్మస్థైర్యాన్ని నింపారని శ్రీ జోగి రమేష్ గారు గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డి గారు సీఎం అయ్యాక మహిళలు ధైర్యంగా ఉన్నారని ఉద్ఘాటించారు.స్థానిక ప్రజా ప్రతినిధులు, నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతానికి పైగా మహిళలు ఉండడం దేశంలోనే ఏ రాష్ట్రంలో లేదన్నారు.నాడు చంద్రబాబు రుణమాఫీ వంటి హామీలతో మహిళలను నమ్మించి మోసం చేస్తే, నేడు వై.ఎస్ జగన్ గారు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంతో పాటు అనేక హామీలు నెరవేర్చడంతో మహిళా సాధికారత సాకారమవుతోందని పేర్కొన్నారు.రేపు విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి మహిళా సదస్సును పండుగలా జరుపుకోవాలని శ్రీ జోగి రమేష్ ఆకాంక్షించారు.

## సిసి రోడ్లు ను ప్రారంభించిన సర్పంచ్ జాలాది



పొన్నూరు మార్చి07( ప్రజా పాలన ప్రతినిధి) :రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించి నేపథ్యంలో మండల పరిధి మామిళ్ళపల్లి గ్రామంలో గూగులమ్మ వీధులో సి సి రోడ్డు నిర్మాణం జరిగింది. సోమవారం గ్రామ సర్పంచ్ జాలాది యానాది రావు రోడ్డును ప్రారంభించారు. అలానే ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న సైడు కాలువలు పరిశీలించారు. అనంతరం జాలాది మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి వై ఎస్ ఆర్ సి పి తోనే సాధ్యమని ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పదంలో నడుస్తుంది అని ఆయన అన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి కరీముల్లా ,సిబ్బంది పాల్గొన్నారు

## సబ్ కలెక్టరుకు జనసేన కౌన్సిలర్ల వినతి పత్రం



నరసాపురం, మార్చి 7 (ప్రజాపాలన ప్రతినిధి) : గత నెల 28వ తేదీన జరిగిన మునిసిపల్ సాధారణ సమావేశాన్ని రద్దుపరచి తిరిగి నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీకి చెందిన కౌన్సిలర్లు కొప్పాడ కృష్ణవేణి, బొమ్మిడి సూర్యకుమారి, తోట అరుణ, భారత సురేష్ లు సోమవారం సబ్ కలెక్టర్ సి విష్ణుచరణ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 28వ తేదీన నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్, మరియు అధికార పార్టీ సభ్యులు అజెండాలోని అంశాలపై చర్చ జరపకుండా తమ అభ్యంతరాలను లెక్క చేయకుండా 1 నుండి 16 అంశములను ఆమోదించి సమావేశాన్ని వాయిదా వేయడం జరిగిందని దీనిని తాము అడ్డుకోవడానికి ప్రయత్నించగా అధికార పార్టీ సభ్యులు తమను నెట్టివేసి వెళ్ళిపోవడం జరిగిందని దీనిపై అదేరోజు మునిసిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేయగా ఇంతవరకూ ఆయన చర్యలు తీసుకోలేదని తెలిపారు. తమకు తగు న్యాయం జరగనందున గత నెల 28వ తేదీన జరిగిన మునిసిపల్ సాధారణ సమావేశాన్ని రద్దుపరచి తిరిగి సమావేశాన్ని నిర్వహించాలని ఆరోజు జరిగిన అవకతవకలపై తగు విచారణ జరిపించాలని, తమ వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని సబ్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశామని వారు తెలిపారు.

## దిశా చట్టం దేశ వ్యాప్తంగా ప్రాచుర్యం: ఆర్.టి.సి. విజయవాడ రీజనల్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి



విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి :సమాజంలో మహిళా వికాసానికి ఇంత వరకూ మనం సాధించిన ప్రగతి మున్ముందు మహిళాభ్యుదయానికి చేపట్టగలిగే ఎన్నో సంస్కరణలు, కార్యక్రమాల గురించి చర్చించుకోవడానికి జాతీయ మహిళా దినోత్సవం వేదిక కావాలని అన్నారు.చైర్ పర్సన్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం మీడియా సమావేశం నుద్దేశించి మాట్లాడుతూ 1910 మార్చి 8న 112 ఏళ్ళ క్రితం క్లారాజ్ట్కిన్ అనే మహిళా ఉద్యమ నాయకురాలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాలని పిలుపును పురస్కరించుకుని జాతీయ స్థాయిలో భాగంగా మార్చి 8 న మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకోవడం జరుగుతున్నట్లు చైర్ పర్సన్ వివరించారు.

## ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి గా పోటు శ్రీనివాసరావు



చిలకలూరిపేట: (ప్రజా పాలన)పట్టణం లోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయం లో ఎస్టీయూ చిలకలూరిపేట పట్టణ శాఖసమావేశం నిర్వహించడం జరిగింది. పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎస్టీయూ రాష్ట్ర 75వకౌన్సిల్ సమావేశం విజయవాడ లో జరిగింది. ఈవార్షిక కౌన్సిల్ లో నూతన కార్యవర్గం ఎన్నిక లో చిలకలూరిపేట పట్టణంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పోటు. శ్రీనివా సరావు రాష్ట్ర కార్యదర్శి గా ఎన్నికయ్యారు. 2002వ సంవత్సరం నుండి చిలకలూరిపేట పట్టణ ప్రధాన కార్యదర్శి గా. జిల్లా స్థాయి లో కార్యదర్శి ఉపాధ్యక్షులు. ఆర్థిక కార్యదర్శి గా రాష్ట్ర స్థాయి లో రాష్ట్ర కౌన్సిలర్.రాష్ట్ర కమిటీ కన్వీనర్. గా వివిధ హొదాలలో పనిచేశారు. శ్రీనివాసరావు కి పట్టణ శాఖ అభినందనలు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం విలీనం పేరుతో ప్రాథమిక పాఠశాలలను హైస్కూల్స్ లో కలపడాన్ని ప్రభుత్వం పునరాలోచన చేయాలని రాష్ట్రోపాధ్యాయసంఘం డిమాండ్ చేస్తుందన్నారు . ఎస్టీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ జమీర్ బాషా, జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, పట్టణ నాయకులు చిలకా.వీరయ్య.ఏ.శ్రీనివా సరావు.సోమ్లానాయక్ కే.ఏడుకొండలు,ఎం.చినవెంకటస్వామి,పి.సాగర్ బాబు. షేక్ కాలేషా. షేక్ ఫరీసా తదితరులు పాల్గొని శ్రీనివాసరావు కి అభినందనలు తెలిపారు . రాష్ట్ర సంఘం లో ఎన్నికవ్వడానికి కృషి చేసిన పట్టణ శాఖ.జిల్లా శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.కోటేశ్వర రావుకి.అందరికీ కృతజ్ఞతలు తెలిపారు ఉపాధ్యాయ రంగ విద్యారంగ.మునిసిపల్ టీచర్స్.మునిసిపల్ పాఠశాల సమస్యల పరిష్కారం లో కృషి చేస్తానన్నారు.

## బాడీ బిల్డింగ్ పోటీలు



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి మార్చి 7: ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో జిల్లా స్థాయి ఎన్టీఆర్ మెమోరియల్ బాడీ బిల్డింగ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. వివిధ కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, గుడివాడ పట్టణ వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు గొర్ల శ్రీను పతకాలు అందజేశారు. క్రీడల అభివృద్ధికి కొన్ని దశాబ్దాలుగా ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో ఎనలేని కృషి చేస్తున్నామని పాలేటి చంటి అన్నారు. గుడివాడ పరిసర ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేలా స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని గుడివాడ పట్టణ వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు గొర్ల శ్రీను కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, కమిటీ జీవితకాల సభ్యులు బొగ్గరపు తిరుపతయ్య, కోచ్ మారెళ్ళ వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా ఉన్న రహదారులను నిర్మించాలని టిడిపి శ్రేణులు రాస్తారోకో



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి మార్చి 7:నిత్యం వేలాది మంది ప్రయాణించే విజయవాడ రహదారి పై ఉన్న గుంతలను టిడిపి నేతలు మీడియాకు చూపించారు. అధ్వానంగా ఉన్న రహదారులను తక్షణం నిర్మించాలని నినాదాలు చేస్తూ పార్టీ నాయకులు ఏఎన్ఆర్ కళాశాల వద్ద రోడ్డుపై బెఠాయించి రాస్తారోకో చేయడంతో విజయవాడ ప్రధాన రహదారి పై, కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. టిడిపి నేతల ఆందోళన నేపథ్యంలో పెద్ద సంఖ్యలో పోలీసులు ఏఎన్ఆర్ కళాశాల వద్దకు చేరుకున్నారు. రాస్తారోకోను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులతో, టిడిపి నేతలు వాగ్వాదానికి దిగారు. ప్రజల నుండి కోట్లాది రూపాయలు పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వం కనీసం గుంతలు కూడా పూర్తి చేయకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి, పార్టీ నాయకులు యార్లగడ్డ సుధారాణి, ముల్లపూడి రమేష్ చౌదరి, చల్లగుళ్ళ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నిర్వహించిన మహిళా దినోత్సవం



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి మార్చి 07: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని గన్నవరం లో లవ్ ల్లీ లేడీస్ కిర్తి పార్టీ చెందిన మహిళ సభ్యులు ఘనంగా నిర్వహించారు. కిర్తీ పార్టీ అర్గనైజర్లు జాస్తి శ్రీవాణీ , గద్దె దీప్తి , వెలివెల శేషు వాణీ ఆధ్వర్యంలో సభ్యులందరు కలిసి కేక్ కట్ చేసి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. సభ్యులకు పలు అటల పోటీలు నిర్వహించి గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. సమాజంలో మహిళ పాత్ర ఎంతో కీలమైందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కిర్తీ పార్టీ ఆర్గనైజర్లు జాస్తి శ్రీవాణీ , గద్దె దీప్తి , వెలవెల శేషువాణీ కిర్తీపార్టీ సభ్యులు ఉప్పలపాటి చంద్రశ్రీ, గూడవల్లి తనూజా , సునీత , సరిత , స్వాతి ,భాను, చందు, సృజన , జాస్తి లక్ష్మీ , పాతూరి దుర్గ , పావని తదితరులు పాల్గొన్నారు.

## మేం అడిగేది గొంతెమ్మ కోర్కెలు కాదు



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి మార్చి07:తాము అడిగేది గొంతెమ్మ కోర్కెలు కాదని ,ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వెటర్నరీ విద్యార్థుల పోరాట కమిటీ నాయకులు సత్యనారాయణ మూర్తి అన్నారు. గన్నవరం వెటర్నరీ కళాశాలలో ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి నాల్గవ రోజుకి చేరింది. మూర్తి మాట్లాడుతూ వెటర్నరీ వైద్యులు చేస్తున్న సేవలకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని అన్నారు. వెటర్నరీ ఆసుపత్రిలోని ల్యాబ్ ల్లో వైద్యులను నియమించాలన్నారు. సంచార వైద్యశాలల్లో ప్రభుత్వమే వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు. స్టైఫండ్ ని నెల కు 14 వేల రూపాయలు పెంచాలని కోరారు. ఈ పోరాటంలో మౌనిక ,సుప్రియ, శిరీష పాల్గొన్నారు.

## అమ్మ ఓల్డ్ ఏజ్ హెూమ్ లో కంటి పరీక్షలు



విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి :గ్లకోమా(నీటి కాసులు) అంటే అంధులను చేసే వ్యాధి అని, అది నయం అయ్యే వ్యాధి కాదని ఆదిలోనే చికిత్సచేస్తే అంధత్వాన్ని నిరోధించవచ్చని గ్లకోమా విభాగం వైద్య నిపుణులు డాక్టర్ మయాంక్ రాయ్ తెలిపారు. ఈ మేరకు గ్లకోమా అవగాహన సదస్సులో భాగంగా సోమవారం గుణదల అమ్మ ఓల్డ్ ఏజ్ హెూమ్ అండ్ హెూమ్ కేర్ నర్సింగ్ సర్వీసెస్, ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ గ్లకోమా సెంటర్ విజయవాడ, సంయుక్త ఆధ్వర్యంలో వృద్దులకు ఉచితంగా గ్లకోమా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మయాంక్ రాయ్ మాట్లాడుతూ గ్లకోమా పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం అని, ముఖ్యంగా వృద్దులలో ఎక్కువగా గ్లకోమా వ్యాధిన భారిన పడతారన్నారు. ఒక్కసారి ఈ వ్యాధి భారినపడితే అంధత్వానికి దారితీస్తుందని కనుక ఆదిలోనే ఈ వ్యాధిని గుర్తించి సరియైన చికిత్స తీసుకోవాలని సూచించారు. అనంతరం అమ్మ ఓల్డ్ ఏజ్ హెూమ్ అండ్ హెూమ్ కేర్ నర్సింగ్ సర్వీసెస్ నిర్వాహకులు డి.రాంబాబు మాట్లాడుతూ తమ వృద్దుల ఆశ్రమంలో కంటి పరీక్షలు నిర్వహించిన ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ వాళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఓల్డ్ ఏజ్ హెూమ్ డి.సుధీర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## మేము మహిళలమే.. మాపై పక్షపాతం వీడండి: సెక్స్ వర్కర్ల వేడికోలు



విజయవాడ, 7 మార్చి: మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అక్రమ రవాణా బాధిత మహిళలు, సెక్స్ వర్కర్ల సంక్షేమం, పునరావాసం, ప్రత్యామ్నాయ జీవనోపాదాల కల్పనలో పూర్తిగా విఫలమైందని పైగా వీరిని అసలు మహిళలుగా కూడా చూడటం లేదని విముక్తి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి హెహరున్నీసా ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ రవాణా బాధిత మహిళలు మరియు సెక్స్ వర్కర్ల రాష్ట్ర సమాఖ్య 'విముక్తి' మరియు హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక రాజీవ్ నగర్, జి.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్లో అక్రమ రవాణా బాధితులు, సెక్స్ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన శ్రీమతి మెహరున్నీసా మాట్లాడుతూ రాష్ట్రంలో 2016 నుంచి 2020 వరకు 1669 మంది మహిళలు ఇండియన్ పీనల్కోడ్ సెక్షన్ల క్రింద, 550 మంది అక్రమ రవాణా నిరోధక చట్టం (ఐ.టి.పి.ఎ) క్రింద కాపాడటం జరిగిందని కాని వీరిలో కనీసం 10 శాతం బాధిత మహిళలకు వివిధ చట్టాలు రాష్ట్ర ప్రభుత్వ జీవోలు ప్రకారం కూడా అందించవల్సిన నష్ట పరిహారం, పునరావాస కార్యక్రమాలు, ప్రత్నామ్నాయ జీవనోపాదులు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విముక్తి ఉపాధ్యక్షురాలు శ్రీమతి రజని మాట్లాడుతూ సెక్స్ వర్లర్లు, అక్రమ రవాణా బాధిత మహిళలపై సమాజంలో ఉన్న కళంకం, వివక్షత వల్ల ఎన్నో ఇబ్బందులుకు గురి అవుతున్నారని వీరిని బాధితులుగా చూడనంత కాలం వీరిని నేరస్థులుగానే సమాజం చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. విముక్తి కార్యదర్శి శ్రీమతి పుష్ప మాట్లాడుతూ నేనే కాదు నాలాంటి చాలామంది మా వార్డులో మహిళలకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల నుంచి మినహాయించబడ్డారు. అలాగే స్థానిక సామాజిక కార్యక్రమాలకు నన్ను ఆహ్వానించడం లేదు.... పైగా నా పిల్లలు మిగిలిన వారి పిల్లలుతో ఆడుకోనియ్యకుండా అడ్డుకొంటున్నారు. మాకు పునరావాసం, ప్రత్యామ్నాయ జీవనోపాదులు కల్పించినట్లయితే మేము ఈ వివక్ష నుంచి బయటపడగలమన్నారు. ఈ కార్యక్రమంలో విముక్తి కోశాధికారి శ్రీమతి అపూర్వ, నాగలక్ష్మి, శ్రీమతి మౌనిక , హెల్ప్ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ శ్రీ వి.భాస్కర్, నితిన్ లతోపాటు 40 మంది విముక్తి సభ్యులు పాల్గొన్నారు.

## స్పందన ఫిర్యాదులపై జాప్యం తగదు ప్రకాశంజిల్లా ఎస్పీ మలిక గార్గ్



పజాపాలన ప్రకాశంజిల్లా ప్రతినిధి... స్పందన ఫిర్యాదులను పరిష్కారం చూపేందుకు ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో కరోనా నియమ నిబంధనలు అనుసరిస్తూ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాలికా గార్గ్ ఫిర్యాదిదారులను నుండి అర్జీలు స్వయంగా స్వీకరించారు. జిల్లాలో వివిధ గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుండి పిర్యాదుదారులు నేరుగా వచ్చి తమ తమ పిర్యాదులను వ్రాతపూర్వకంగా ఎస్పీకి విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేదింపులు, ఉద్యోగ, ఆన్ లైన్ మోసాలు, భూ వివాదాలు మరియు ఇతర సమస్యల గురించి ఫిర్యాదుదారులు ఎస్పీకి స్వేచ్ఛగా విన్నవించారు. టంగుటూరు గ్రామంకు చెందిన యు.పవన్ అనే వ్యక్తి తన స్నేహితుడైన నరసింహారావుకు కుటుంబ అవసరాల నిమిత్తం క్రెడిట్ కార్డులు ఇవ్వగా అతను తెలియకుండా ఆ క్రెడిట్ కార్డు ద్వారా 6 లక్షల 70 వేల రూపాయలు నగదు తీసి వాడుకొని ఆ డబ్బులు తిరిగి చెల్లించ మంటే డబ్బులు చెల్లించకుండా అడుగుతుంటే బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేసాడు. తన అల్లుడు ఖాళీ అగ్రిమెంట్ పేపర్లపై సంతకాలు తీసుకుని, కొంతకాలం గడిచిన తర్వాత తనను ఇల్లు ఖాళీ చేయమని కొట్టి బెదిరిస్తున్నట్లు ఒంగోలు పాపా కాలనీకు చెందిన దయమ్మ అనే వృద్ధురాలు పిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ప్రతి ఒక్క పిర్యాదుకు సంబంధించిన అన్ని విషయాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకొని, సంబంధిత పోలీస్ స్టేషన్ల పరిధిలోని అధికారులతో మాట్లాడి, ఆయా ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కారించి భాదితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నివేదిక కూడా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారం కొరకు పోలీసు స్టేషన్లు, కార్యాలయాలకు వచ్చు ఫిర్యాదిదారులకు పోలీసు అధికారులు మరియు సిబ్బంది అందరూ మర్యాదగా వ్యవహరించి చట్ట పరిధిలో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలోనే కాక అన్ని పోలీస్ స్టేషన్ లు, సర్కిల్ ఆఫీస్ లు మరియు %ాణూౄా% ఆఫీస్ ల అధికారులు స్పందన పిర్యాదులను స్వీకరించిన, వాటి మీద తగిన చట్ట పరిధిలో చర్యలు తీసుకోవటం జరిగింది. ఈ స్పందన కార్యక్రమంలో %ూణ% శ్రీమతి కె.చౌడేశ్వరి, %ణూదీ ణూౄా% బి.మరియదాసు, ట్రాఫిక్ %ణూౄా% మల్లిఖార్జునరావు, దిశ డిఎస్పీ పల్లపురాజు, స్పందన %జ×% అశోక్ కుమార్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, స్పందన ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన సర్పంచ్ సునీత



కంచికచర్ల మార్చి 7 (ప్రజాపాలన ప్రతినిధి)కంచికచర్ల గ్రామంలోని డివిఆర్ మోడల్ కాలనీ లో గల మండల ప్రజా పరిషత్ పాఠశాలను సోమవారం విద్యా కమిటీ చైర్మన్ మహమ్మద్ చాంద్ బేగం, వైసీపీ నాయకులతో కలిసి సర్పంచ్ వేల్పుల సునీత సందర్శించారు. స్కూల్ లోని విద్యార్థినీ విద్యార్థులను మధ్యాహ్న భోజనం ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం మంచి భోజనం అందిస్తున్నరని విద్యా ర్థులు అడగగా అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థు ల రోజువారీ హాజరు పట్టీని పరిశీలించారు. విద్యార్థు లు రోజు స్కూల్ కి రావడం ఆనందంగా ఉందన్నారు. సర్పంచ్ సునీత విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడగగా వెంటనే సమాధానం చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చే శారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ చైర్మన్, విద్యా ర్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలు తరగతి గదిలో కూర్చోడానికి కింద గచ్చు పలిగిపోయిందని, చుట్టూ కాంపౌండ్ వాల్ లేకపోవడంతో రాత్రి అయ్యే సరికి ఆకతాయిలు వచ్చి పాఠశాలలోని ఆవరణలో కూర్చొ ని మద్యం సేవించి అపరిశుభ్రం చేస్తున్నారని సర్పంచ్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో స్పందించిన సర్పంచ్ వేల్పుల సునీత మాట్లాడుతూ పాఠశాల సమస్యలు తమ దృష్టికి వచ్చాయని స్థానిక నాయకుల సమన్వ యంతో ఈ సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరు ణకుమార్ దృష్టికి తీసుకువెళ్లి వారి సహాయ సహకా రాలతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చాంద్ బేగం, ఉపాధ్యాయులు అంకమ్మరావు, రోజా, వైసిపి నాయకులు మాజీ ఎంపిటీసీ సభ్యులు వేల్పుల శ్రీనివాసరావు, వంగా శ్రీనివాసరావు, గూగు లోతు శివ నాయక్, పసుపులేటి గోపి, చలవాది నాగే శ్వరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు సైతం క్రీడారంగంలో రాణించాలి: విమల భాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను



పెనుగంచిప్రోలు మార్చి 7ప్రజాపాలన ప్రతినిధి:జగ్గ య్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు గ్రామంలో జడ్పీటీసీ సభ్యురాలు వుట్ల నాగమణి ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకల్లో భాగంగా కబడ్డీ పోటీ లను విమలభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ మహిళా దినోత్సవ వేడుకల్లో భా గంగా పెనుగంచిప్రోలు గ్రామంలో కబడ్డీ పోటీలను ని ర్వ హించడం సంతోషంఅని, ఈరోజుల్లో మహిళలు సైతం అన్ని రంగాల్లో ముందు ఉంటున్నారు అని,అ లాగే క్రీడా రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి న మహిళా సోదరిమణులు అనేక మంది ఉన్నారు అ ని,వారందరిని మీరు ఆదర్శంగా తీసుకోవాల ని,ఆడ బిడ్డలు సైతం పెరుగుతున్న టెక్నాలజీ కి అనుగు ణం గా జీవనశైలి మార్చుకొని మనకు మనమే రక్షణ కవ చం ఏర్పాటు చేసుకోవాలని, అందుకు ప్రభుత్వాలు కూడా సహకారాన్ని అందిస్తున్నాయని,పట్టుదలతో జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాం క్షించారు. ఈకార్యక్రమంలో అనిగండ్లపాడు సర్పంచ్ జ్యోతి బ్రహ్మం, ఎంపిటిసిలుచాట్ల సుశీల,కాకని స్రవం తి,బారు సుధారాణి,మండల సమైక్య బొమ్మి రత్న కు మారి,హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు జలజా ,గార్ల్స్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మావ తి ,తదితర మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నా రు.

## జగనన్న కాలనీల పై సమీక్ష సమావేశం



పొన్నూరు మార్చ్07( ప్రజా పాలన ప్రతినిధి) :జగనన్న ఇళ్ల పై స్థానిక మండల ఉన్న ఉన్న పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో అత్తోట దీప్తి అధ్యక్షత వహిస్తూ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన స్థలాలలో లబ్ధిదారులను ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ఇంజనీరింగ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు అవగాహన కల్పించాలని కోరారు. మండలంలో నూరు శాతం పేదలందరికీ ఇళ్లు పథకం అమలు కు సిబ్బంది పని చేయాలని సూచించారు. గృహ నిర్మాణాలు చేపట్టే దగ్గర సీఎం ఇంజనీరింగ్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఈ కోటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట అభివృద్ధి ప్రధాత కీ.శే.స్వర్గీయ సామినేని విశ్వనాధం: ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట మార్చి7 ప్రజాపాలన ప్రతినిధి:కీ.శే.స్వర్గీ య. సామినేని విశ్వనాధం 5 వ వర్ధంతి పట్టణంలోని, శ్రీమతి. గేంటెల శకుంతలమ్మ కళాశాలలో జరిగినది. ఈకార్యక్రమంలో వారి కుమారులు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్,జగ్గయ్యపేట నియోజకవర్గ శాసన స భ్యులు ఉదయభాను పాల్గొన్నారు. ఈసంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టిన గడ్డ కోసం అహర్ని శలు కృషి చేసిన గొప్ప వ్యక్తిత్వం ఉన్న ఆయన కడు పు న జన్మించడం పూర్వజన్మ సుకృతం అని, జగ్గ య్యపేట రాజకీయ చరిత్ర లో సామినేని కుటుంబం అనే పేరు ను శాశ్వత చిరునామా గా రాసిన ఆయన పట్టుదల, ఆయన దీక్ష, ఆయన త్యాగం, ఆయన అం కుటిత దీక్ష,కార్యసిద్ధి మాకు ఆదర్శం అని, ఆయన లోటు ఇప్పటికీ మా కుటుంబానికి తెలుస్తోందని ఇం తమంది అభిమానులను మాకు అందించిన ఆయన మార్గం ఆచరనీయం అని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కెడిసిసి బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు గారు, వివిధ కార్పోరేషన్ డైరెక్టర్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,వివిధ విభాగాల పార్టీ శ్రేణు లు,బూత్ కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులు, కా ర్య కర్తలు తదితరులుపాల్గొన్నారు.

## వార్షిక తనిఖీలలో భాగంగా దిశ మహిళా పోలీసు స్టేషన్ తనిఖీ చేసిన అర్బన్ జిల్లా ఎస్పీ



రాజమహేంద్రవరం :ప్రజాపాలన ప్రతినిధి:అర్బన్ జిల్లా ఎస్పీ శ్రీ ఐశ్వర్య రస్తోగి సోమవారం వార్షిక తనిఖీలలో భాగంగా దిశ మహిళా పోలీసు స్టేషన్ ను తనిఖీ చేసి పోలీసు స్టేషన్ పని తీరు, కేసుల దర్యాప్తు మరియు వివాహ సంభంద కేసుల కౌన్సిలింగ్ మరియు దర్యాప్తుల గురించి దిశ యాప్ పై ప్రజలకు అవగాహనా మరియు దిశ పెట్రోలింగ్ విధుల నిర్వహణ గురించి ఇతర అంశాలపై డిఎస్పీ శ్రీ కె.తిరుమల రావుతో చర్చించారు. ఈ తనిఖీలో ఎస్పీ స్టేషన్ రికార్డు లను పర్యిలించి, రికార్డు లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మరియు దిశ యాప్ విశిష్టతపై ప్రతి మహిళలకు ముఖ్యంగా కాలేజీ విద్యార్థినులకు మరియు మహిళా ఉ ద్యోగులకు పూర్తి అవగాహన కల్పించాలని తగు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. అనంతరం స్టేషన్ రిసెప్షన్ కౌంటర్, హెల్ప్ డెస్క్ లను పరిశీలించి, స్టేషన్ కు వచ్చు ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. అలాగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పోలీసు స్టేషన్ మహిళా సిబ్బందితో మాట్లాడి వారికీ అభినందనలు తెలియ పరచి వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి డిఎస్పీకి తగు సూచనలు చేసినారు.

## ఒక్క వార్డు ప్రజలకే కాదు.. చీరాలప్రజలందరికీ సేవ చేస్తా ..




చీరాల : ఒక్క వార్డు ప్రజలకే కాదు.. చీరాల ప్రజలందరికీ సేవ చేస్తా అన్న ఆలోచన అభినందనీయం, కేవలం మున్సిపల్ కౌన్సిలర్ గా, ఒక వార్డ్ ప్రజలకే కాదు.., చీరాలలో ప్రజలందరికీ సేవ చేయడమే లక్ష్యంగా, రోటరీ సభ్యునిగా చేరేందుకు, మున్సిపల్ 19 వ వార్డు కౌన్సిలర్ మించాల సాంబశివరావు ముందుకు రావటం ప్రశంసనీయం మరియు సూర్తిదాయకమని, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె ప్రభాకర్,రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల అధ్యక్షులు దోగుపర్తి వెంకటసురేష్ లు అన్నారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ విజిట్ సందరరేగా, శనివారం రాత్రి జరిగిన కార్యక్రమం లో, రోటరీ క్లబ్ ఆఫ్ చీరాలలో సభ్యులుగా చేరేందుకు 19వ వార్డు కౌన్సిలర్ మించాల సాంబశివరావు, విశ్వకర్మ ప్రభాకర్ శర్మ, నర్సింగ్ ఇన్స్టిట్యూట్ నారాయణ ముందుకు రాగా,వారిని క్లబ్ లోకి సాదరంగా ఆహ్వానించారు. రోటరి డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.ప్రభాకర్ చేతులమీదుగా, రోటరీ సభ్యుని బ్యాడ్జ్ పెట్టించి,. రోటరీ సభ్యులుగా చేరినందుకు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ, రోటరీ క్లబ్ సభ్యులు గా చీరాల వ్యాప్తంగా ప్రజలందరికీ సేవ చేసేందుకు, ఎల్లవేళలా నిస్వార్ధంగా, నిష్పక్షపాతంగా అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. క్లబ్ లన్నింటిలో కెల్లా, కరోనా మహమ్మారి ప్రబలే సమయంలో సైతం, స్పూర్తినిచ్చేలా రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల వారు, అందిం చిన సేవలను చూసి, తమ సేవలు అందించడానికి, ఇదే సరైన వేదికగా భావించి సభ్యులుగా చేరేందుకు గర్వపడుతున్నామన్నారు.



# పాన్ ఇండియా స్టార్ నమ్మనంటున్నాడు



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ దానిపై నాకు నమ్మకం లేదంటున్నారు. మిగతా వారికి వున్న నమ్మకం తనకు లేదని క్లారిటి ఇచ్చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... ప్రభాస్ నటించిన లేటెస్ట్ మూవీ 'రాధేశ్యామ్'. ఈ మూవీ ఎప్పుడెప్పుడు థియేటర్లోలో విడుదలవుతుందా? ఎప్పుడెప్పుడు చూడాలా? అని గత కొంత కాలంగా ప్రభాస్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రభాస్ నుంచి సినిమా వచ్చి దాదాపు మూడేళ్లు దాటుతోంది. ఈ నేపథ్యంలో తన సినిమా ఎప్పుడు విడుదలవుతుందా? అని అభిమానులతో పాటు సగటు సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దాంతో 'రాధేశ్యామ్' మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. చాలా కాలం తరువాత ప్రభాస్ నుంచి వస్తున్న సినిమా కావడం.. హాలీవుడ్ చిత్రాలని తలపించే స్థాయిలో భారీ బడ్జెట్ తో సినిమాని నిర్మించడం.. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ లు సినిమాపై మరింత క్రేజ్ ని క్రియేట్ చేయడంతో ఇప్పుడు 'రాధేశ్యామ్' వరల్డ్ వైడ్ గా హాట్ టాపిక్ గా మారింది. యువీ క్రియేషన్స్ టి సిరీస్ సంస్థలు అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న వరల్డ్ వైడ్ గా ఐదు భాషల్లో విడుదలవుతోంది. ఇటీవల రిలీజ్ ట్రైలర్ తో ముంబై వేదిగా చిత్ర బృందం 'రాధేశ్యామ్' రిలీజ్ ప్రమోషన్స్ ని ప్రారంభించేశారు. ఇదే వేదిక సాక్షిగా సినిమా విశేషాలతో పాటు వ్యక్తిగత విషయాల్ని కూడా వెల్లడించి ప్రభాస్ షాకిచ్చారు. ఇటీవల ముంబైలో ప్రచారం పూర్తి చేసిన ప్రభాస్ టీమ్ తాజాగా హైదరాబాద్ లో ప్రచారాన్ని స్పీడప్ చేసింది. ఈ సందర్భంగా పలు మీడియా సంస్థలతో ముచ్చటించిన ప్రభాస్ షాకింగ్ విషయాల్ని బయటపెట్టారు. 'రాధేశ్యామ్'లో ప్రభాస్ హస్తసాముద్రికా (పాల్మిస్ట్) నిపుణుడిగా విక్రమాదిత్య పాత్రలో నటిస్తున్నారు. సెలబ్రిటీల నుంచి దేశ ప్రదాని వరకు తను చెప్పింది వింటారట. ఎమర్జెన్సీ నాటి పరిస్థితుల్ని కూడా ఈ చిత్రంలో లైట్ గా టచ్ చేసినట్టుగా ప్రచారం జరుగుతోంది. విధికి ప్రేమకు మధ్య జరిగే యుద్ధం నేపథ్యంలో సరికొత్త బ్యాక్ డ్రాప్ లో ఈ మూవీని రూపొందించారు. జాతకాలు.. అవి నిర్ణయించే పరిస్థితుల కారణంగా ఓ జంట ఎలాంటి ఇబ్బందుల్ని ఎదుర్కొంది?.. చివరికి విధి అంచనాలని ఎలా తలకిందులు చేసి తన పంతం నెగ్గించుకుంది అన్నదే ఇందులో ప్రధాన ఇతివృత్తం. అయితే 'రాధేశ్యామ్' చిత్ర కథ ఏ అంశం ప్రధనంగా సాగుతుందో ఆ అంశంపై అంటే జాతకాలపై తనకు నమ్మకం లేదని ప్రభాస్ ఇటీవల ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పడం పలువురిని షాక్ కు గురిచేస్తోంది. సినిమాలోని పాత్రకు నేను పూర్తి భిన్నం అని చెప్పిన ప్రభాస్ జ్యోతిష్యాన్ని తాను నమ్మనని స్పష్టం చేశారు. అయితే మిత్రుల నుంచి దీనికి సంబంధించిన ఆసక్తికరమైన కథల్ని తాను తెలుసుకున్నానని మన నాలెడ్జ్ కి మించింది ఏదో ఉందని మాత్రం తాను నమ్ముతానని తెలిపారు. అయితే 'బాహుబలి' అద్భుతమైన విజయం తరువాత తాను విధిని విశ్వాసాన్ని నమ్మడం మొదలుపెట్టానని స్పష్టం చేయడం ఆసక్తికరంగా మారింది.

# పవన్ - క్రిష్' సినిమా పై లేటెస్ట్ అప్ డేట్ !




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ క్రియేటివ్ డైరెక్టర్ క్రిష్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న 'హరిహర వీరమల్లు' సినిమా షూటింగ్ ను వచ్చే వారం నుంచి స్టార్ట్ కానుంది. ముందుగా యాక్షన్ సీక్వెన్స్ ను షూట్ చేయనున్నారు. ఇక ఈ సీక్వెన్స్ కోసం ఇప్పటికే ప్రత్యేక సెట్స్ కూడా వేస్తున్నట్లు తెలుస్తోంది. అన్నట్టు ఈ షెడ్యూల్ తో సినిమాలో కీలక భాగం షూటింగ్ మొత్తం పూర్తి అవుతుందట. కాగా మొఘల్ కాలం నాటి ఫిక్షన్ కథతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇక ఈ సినిమాలో జాక్విలిన్ ఫెర్నాండెజ్ ఓ కీలక పాత్రలో నటిస్తోంది. అలాగే ఈ మూవీలో హీరోయిన్ గా నిధి అగర్వాల్ నటిస్తోంది. ఇక ఈ సినిమాని పాన్ ఇండియా సినిమాగా తీసుకురానున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై ప్రముఖ నిర్మాత ఏ ఎం రత్నం ఈ సినిమాని భారీగా నిర్మిస్తున్నారు.

# బేబమ్మ నిజంగానే నో చెప్పిందా..?



తాజాగా సూపర్ స్టార్ మహేష్ బాబు 28వ సినిమా లో కీలక పాత్రకు గాను కృతి శెట్టిన ఎంపిక చేశారనే వార్తలు వస్తున్నాయి. సినిమా కోసం ఈమెను సంప్రదించారనే వార్తలు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఈ సమయంలో బేబమ్మ మహేష్ బాబు సినిమా లో అంటే ఓకే కాని సెకండ్ హీరోయిన్ పాత్రకు ఎలా ఒప్పుకుంది అంటూ షాక్ అవుతున్నారు. మహేష్ బాబు.. త్రివిక్రమ్ కాంబో మూవీలో ఇప్పటికే పూజా హెగ్దేను హీరోయిన్ గా ఎంపిక చేయడం జరిగింది. సినిమా పూజా కార్యక్రమాల్లో పూజా హెగ్దే కూడా పాల్గొంది. కనుక ఆమె మెయిన్ హీరోయిన్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. త్రివిక్రమ్ సినిమాల్లో ఇద్దరు హీరోయిన్స్ ఉండటం చాలా కామన్ గా చూస్తూ ఉంటాం. కనుక ఈ సినిమా లో సెకండ్ హీరోయిన్ గా బేబమ్మ కృతి శెట్టిని ఎంపిక చేయాలని భావించి ఉంటారు. అందుకు ఆమె నో చెప్పి ఉంటుంది అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మహేష్ బాబు త్రివిక్రమ్ కాంబో మూవీ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో ఆ సినిమా నుండి ఇలాంటి పుకార్లు షికార్లు చేయడం అభిమానులకు కాస్త నిరాశ ను కలిగిస్తుంది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే విధంగా త్రివిక్రమ్ నుండి మహేష్ సినిమా వస్తుందనే నమ్మకంను పెట్టుకుని మరీ అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో సినిమా గురించి అనేక పుకార్లు షికార్లు చేస్తున్నాయి. సినిమా ప్రారంభంకు ఇంకాస్త సమయం పట్టే అవకాశం ఉంది. కనుక అప్పటి వరకు ఇలాంటి పుకార్లు మీడియాలో షికారు చేస్తూనే ఉంటుంది. సినిమా ప్రారంభించి ఇదే ఏడాది చివరి వరకు లేదా వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను విడుదల చేయాలని త్రివిక్రమ్ ప్లాన్ చేస్తున్నాడనే వార్తలు వస్తున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఈసినిమా లో మహేష్ బాబు రోల్ చాలా డిఫరెంట్ గా ఉంటుందని అంటున్నారు.

# నాటి మేటిస్టార్లంతా ఒకే ఫ్రేమ్ లో చిక్కారిలా!



మెగాస్టార్ చిరంజీవి-విశ్వనటుడు కమల్ హాసన్-నట సామ్రాట్ నాగార్జున-నటసింహ బాలకృష్ణ అంతా ఒకే జనరేషన్ హీరోలు. 80-90 దశాకాల్లో హీరోలంతా కలిసి పనిచేసారు. లాంచింగ్ విషయంలో వెనుకా..ముందు అవ్వొచ్చు గానీ అంతా సమకాలీకులే. ఒక హీరో సినిమాలు మరో హీరోకి పోటాపోటీగా రిలీజ్ అయ్యేవి. బాక్సాఫీస్ వద్ద నువ్వా? నేనా? అన్న రేంజ్ లో పోటీ వాతావరణం ఉండేది. అప్పట్లో అభిమాన సంఘాల మధ్య పోటీ కూడా అలాగే ఉండేది. తమ అభిమాన హీరో సినిమా రిలీజ్ అవుతుందంటే? ముందు రోజు థియేటర్ ఏ రేంజ్ లో ముస్తాబయ్యేదో ..హడావుడి..హంగామా ఎలా ఉండేదో చెప్పాల్సిన పనిలేదు. అలా అభిమానుల మధ్య వైరాలు..వైశమ్యాలు ఇప్పటితో పోలిస్తే అప్పుడు పీక్స్ లో ఉండేవి. హీరోల మధ్య సైతం ఈగో ఫ్యాక్టర్ ఎక్కువగా కనిపించేది. ఇప్పటిలా పాత రోజుల్లో ఒక హీరో ఫంక్షన్ కి మరో హీరో అటెండ్ అవ్వడం అన్నది చాలా రేర్ గా జరిగేది. అయితే చిరంజీవి-నాగార్జున-కమల్ స్నేహం ఈనాటిది కాదని రుజువు చేసే మరో పిక్ ఒకటి తాజాగా నెట్టింట వైరల్ గా మారింది. కుడివైపున చిరంజీవి ఆ పక్కనే బాలకృష్ణ అటుపై కమల్ హాసన్..ఆ చివరన నాగార్జున నలుగురు కలిసి ఇలా ఓ సందర్భంలో ఫోటో దిగారు. ఒకే ఫ్రేమ్ లో ఆ నలుగురు స్టార్లని ఇలా బంధించారు. చిరంజీవి క్యాజువల్ వేర్స్ లో టక్ చేయగా..బాలయ్య బ్లూ జీన్స్ ధరించి క్యాజువల్ షర్ట్ తో టక్ చేసి కనిపిస్తున్నారు. ఇక కమల్ హాసన్ బ్లాక్ అండ్ బ్లాక్ జీన్స్..టీషర్టు ధరించారు. నాగార్జున సర్ఫ్ కలర్ నెక్ బనియన్.. ఆపైన బ్లాక్ డిజైన్ తో ఉన్న కోట్ ధరించారు. ఏదో సినిమా ఈవెంట్ లోనే ఈ నలుగురు ఇలా కలిసి ఫోటో దిగినట్లు తెలుస్తోంది. ఓల్డ్ ఈజ్ గోల్డ్ పిక్ సోషల్ మీడియాలో సమ్ థింగ్ స్పెషల్ గా ఫోకస్ అవుతుంది. ఆ ఫోటోలో నలుగురు హీరోల వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండొచ్చు అని అభిమానులు గెస్ చేస్తున్నారు.

# రాఖీభాయ్ మళ్లీ వెనక్కి తగ్గుతున్నారా?




రాఖీభాయ్ యష్ నటించిన పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ కేజీఎఫ్ చాప్టర్ 1 దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. సైలెంట్ గా విడుదలైన ఈ మూవీ మోన్ స్టర్ గా మారి వరల్డ్ వైడ్ గా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించింది. కన్నడ ఇండస్ట్రీకి మునుపెన్నడూ కని వినీ ఎరుగని గుర్తింపుని అందించింది. పిరియాడిక్ ఫిక్షనల్ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం ఒకేసారి ఇద్దరిని పాన్ ఇండియా స్టార్ లుగా నిలబెట్టింది. హీరో యష్ అప్పటి వరకు ఓ సాధారణ యాక్షన్ హీరో దర్శకుడు ప్రశాంత్ నీల్ వన్ ఫిల్మ్ వండర్. కానీ ఈ ఇద్దరు కేజీఎఫ్ చాప్టర్ 1 తో పాన్ ఇండియా స్టార్ లు గా మారిపోయారు. ప్రస్తుతం ఈ ఇద్దరు కలిసి కేజీఎఫ్ చాప్టర్ 2ని చేసిన విషయం తెలిసిందే. ఫస్ట్ పార్ట్ సంచలనాలు సృష్టించగడంతో చాప్టర్ 2పై అంచనాలు ఏర్పడ్డాయి. అందుకు అనుగుణంగానే చాప్టర్ 2కి సరికొత్త హంగులతో పాటు క్రేజీ యాక్టర్ లని జోడించారు ప్రశాంత్ నీల్. చాప్టర్ 2కు కీలకంగా మారే అధీరా పాత్రలో బాలీవుడ్ బ్యాడ్ మెన్ సంజయ్ దత్ నటించగా రాఖీ భాయ్ పై షూటెడ్ సైట్ ఆర్డర్స్ ఇచ్చే ప్రధాని రమికా సేన్ పాత్రలో రవీనా టాండన్ నటించింది. ఇక మరో రెండు కీలక పాత్రలలో ప్రకాష్ రాజ్ రావు రమేష్ కనిపించబోతున్నారు. చాప్టర్ 1ని దృష్టిలో పెట్టుకుని చాప్టర్ 2 మరింత హైలీగా వుంటుందని గరుడని అంతం చేసిన రాఖీ తనే సర్వాధికారికగా మారి ఎంపరర్ ని ఎలా నిర్మించుకున్నాడు? దీనికి ఏం చేశాడు? ఈ క్రమంలో రాఖీకి అధీరా కలిగించిన అంతరాలేంటీ? అనే ఆసక్తికరమైన కథ కథనాలతో చాప్టర్ 2 సాగబోతోంది. ఇప్పటికే విడుదల చేసిన టీజర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. టీజర్ లోనే రాఖీ తన విశ్వరూపాన్ని చూపించేయడంతో ట్రైలర్ ఇక భీభత్సమే అనే కామెంట్ లు వినిపిస్తున్నాయి. ఈ నెల 27న ఈ చిత్ర ట్రైలర్ ని విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం ఇటీవల ప్రకటించింది. అంతే కాకుండా ఈ మూవీని ఏప్రిల్ 14న నవిడుదల చేస్తున్నామని మరో సారి స్పష్టం చేసింది. అయితే తాజాగా ఈ డేట్ కి కేజీఎఫ్ 2 విడుదల కావడం కష్టమనే సంకేతాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రెండు మూడు సార్లు రిలీజ్ వాయిదా పడిన ఈ మూవీ మరో సారి వెనక్కి వెళ్లే అవకాశం వుందని చెబుతున్నారు. రికార్డు స్థాయిలో చాప్టర్ 1 కి మించి బిజినెస్ జరుపుకుంటున్న ఈ మూవీ వీఎఫ్ ఎక్స్ కారణంగా ఆలస్యం అయ్యే అవకాశం వుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఏప్రిల్ రెండవ వారం మిస్ అయితే మూడవ వారం ఈ మూవీ థియేటర్లలో సందడి చేయడం ఖాయంగా కనిపిస్తోందని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. ఇందులో యష్ కి జోడీగా శ్రీనిధిశెట్టి నటించింది. మాళవిక అవినాష్ ఈశ్వరీ రావు అచ్యుత్ కుమార్ బి.ఎస్. అవినాష్ నాగాభరణ వశిష్ఠసింహా తదితరులు కీలక పాత్రల్లో నటించారు. రవిబాస్రూర్ సంగీతం అందించగా భువన గౌడ ఛాయాగ్రహణం అందించారు. తెలుగులో దిల్ రాజు హిందీలో ఫర్హాన్ అక్తర్ తమిళంలో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ మలయాళంలో హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్ పై రిలీజ్ చేస్తున్నారు.

## బాలయ్యతో మల్టీస్టారర్ ప్లాన్ చేస్తున్న డైరెక్టర్ ?

డైరెక్టర్ పరుశురామ్ బాలయ్యతో ఓ సినిమా చేయాలని ఆలోచిస్తున్నట్లు గతంలోనే వార్తలు వచ్చాయి. తాజాగా ఈ సినిమా పై మరో వార్త కూడా వినిపిస్తోంది. ఈ సినిమా మల్టీస్టారర్ అని.. ఈ సినిమాలో మరో యంగ్ హీరో కూడా కనిపించనున్నాడని తెలుస్తోంది. ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా పరశురామ్ దర్శకత్వంలో 'సర్కారు వారి పాట' సినిమా వస్తోంది. ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్ టైనర్ రిలీజ్ తర్వాత.. పరశురామ్ బాలయ్యతో సినిమా చేస్తాడట. పరశురామ్ గతంలోనే బాలయ్యకి ఓ కథ చెప్పాడు, ఆ కథనే ఇప్పుడు సినిమాగా చేయాలనుకుంటున్నాడు. మొత్తానికి ఈ కాంబినేషన్ నిజం అయితే మాత్రం ప్రేక్షకుల్లో మంచి ఇంట్రెస్ట్ ఉంటుంది. పైగా 'సర్కారు వారి పాట' సినిమా తర్వాత సినిమా కాబట్టి.. ఈ సినిమా పై భారీ అంచనాలు ఉంటాయి. మరి బాలయ్య కోసం పరుశురామ్ ఎలాంటి కథ రాశాడో చూడాలి. అలాగే వీరి కలయికలో వచ్చే సినిమా ఏ జోనర్ లో రానుందో కూడా చూడాలి.

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేడ్కర్



BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేడ్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేడ్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com